# పరోపకారార్థ మిదం శరీరం

# సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత చరిత్ర



**జననం : జూలై 15, 1939** **మహా : సమాధి జూన్ 17, 2017**

శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్, గొలగమూడి, నెల్లూరు జిల్లా



**అంకితము: శ్రీ భరద్వాజ మాస్టర్ గారి పాదపద్మములకు**

**మనవి:** శ్రీ సద్గురు పెసల సుబ్బరామయ్య గారు 2017 జూన్ 9 వ తేదీన (జ్యేష్ట శుద్ధ పౌర్ణమి) మహాసమాధి చెందారు. వారి మొదట ఆరాధన సందర్భంగా వారి సంక్షిప్త జీవిత చరిత్రను, వారి భక్తుల అనుభవాలను నలుగురితో పంచుకోవాలన్న సత్సంకల్పమే ఈ చిన్ని సంచిక. ఈ గ్రంధాన్ని అందరూ శ్రద్ధగా చదివి సార్ యొక్క అనుగ్రహ ఆశీస్సులు పొందగలరని ప్రార్ధిస్తున్నాము.

**సేకరణ:** ప్రసాద్, సాయి సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్

**పర్యవేక్షణ:** శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ సభ్యులు

**ప్రాప్తిస్థానము:** శ్రీ సాయిమాస్టర్ సేవా ట్రస్ట్, గొలగమూడి, నెల్లూరు జిల్లా – 524321

ఈ గ్రంధ రచనకు సహకరించిన వారందరికీ హృదయపూర్వక నమస్కారములు! కొన్నిచోట్ల ఏకవచన ప్రయోగం చేసియున్నాము. ఎవరి మనస్సునైనా బాధ పెట్టి వుంటే క్షమించగలరు.

## శ్రీ సుబ్బరామయ్య గురించి మహనీయుల తీర్పు

### శ్రీ శ్రీ శ్రీ వెంకయ్యస్వామి తీర్పు

స్వామి సేవకుడు రోశిరెడ్డికి అత్యవసర విషయములలో ఏ వ్యక్తి ఎలాంటివాడు అనే విషయముగానీ, ఎచ్చట ఏమి జరుగుచున్నది గానీ శ్రీ వెంకయ్యస్వామి దృశ్య సంకేతములతో చూపేవారు. ఒకరోజు సుబ్బరామయ్య సార్ గురించి యోచిస్తుంటే సార్ తాళాల బుర్రలు రిపేరు చేస్తున్నట్లు చూపారు. దానికి శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారు ఇచ్చిన వ్యాఖ్య "అందరి లోపాలు సరిచేయగల సమర్థుడు" అంటే సార్ సర్వజ్ఞులు (లోపాలు తెలిసిన వారు), సర్వ సమర్థులు, సర్వవ్యాపకులు (అందరి గురించి తెలిసినవారు) అయ్యి వుండాలి.

### శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ గారి తీర్పు

మచ్చా రామకృష్ణ (కడప వాస్తవ్యులు) కి ఒకరోజు భరద్వాజ మాస్టారు గారు కలలో కనపడి "సుబ్బరామయ్య, నేనూ ఒకటే! నువ్వు సుబ్బరామయ్య చెప్పినట్లు చెయ్యి" అని చెప్పారు.

విద్యానగర్ వసంతమ్మ గారు 2008లో గొలగమూడిలో జరిగిన శ్రీ సాయి మాస్టారు సమ్మేళనం తర్వాత కొన్ని రోజులకి శ్రీ భరద్వాజ మాస్టర్ ఆమెకి స్వప్నంలో కనపడి "సుబ్బరామయ్య ఉండమన్నా ఉండకుండా వచ్చేశావే? ఇద్దరు మహనీయులను (శ్రీ శ్రీ శ్రీ శ్రీ వెంకయ్యస్వామి, శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్) సేవించిన మహనీయుడు. అలాంటి ఆయన దొరుకుతాడా!" అని గద్దించారు.

### నీలకంఠరావుపేట సద్గురు శ్రీ శ్రీ శ్రీ దర్గాస్వామివారుచెప్పినవి

- జిహ్వాను జయించాడు
- సార్ ని చూపెడుతూ "పరోపకారార్థ మిదం శరీరమ్"
- వెంకయ్యస్వామికి దత్తుడు, మాకూ దత్తుడే
- వెంకయ్యస్వామి తెచ్చుకున్నాడు నిన్ను. నీ చేత తప్పు చేయించడు
- వెంకయ్యస్వామిలో సుబ్బరామయ్య వున్నాడు, సుబ్బరామయ్యలో వెంకయ్యస్వామి స్వామి వున్నాడు

# దైవం మానుష రూపేణ

దేవుణ్ణి తెలుసుకునే మార్గం చెప్పమన్న భక్తులతో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారు అంటారు "నీయాల్నే వస్తే నీవేమి కనుక్కుంటావయ్యా!". ఇది ఈనాడు నెల్లూరు జిల్లా గొలగమూడి వాస్తవ్యులు శ్రీ శ్రీ శ్రీ పెసల సుబ్బరామయ్య గారి ఎడల అక్షరాల నిజమైంది. వారు మానవ రూపంలో మన ముందున్న భగవంతుడే అని భక్తుల అనుభవాలు నిరూపిస్తున్నవి.

వారెంతటి మహనీయుడో తెలియనిదే హృదయ పూర్వకమైన భక్తిశ్రద్ధలతో నమస్కరించలేము. అందరూ నమస్కరిస్తున్నారు కాబట్టి మనమూ నమస్కరిస్తాము. వారెంతటి వారో తెలియజేసి వారి యెడల మన హృదయాలలో తగువిధమైన భక్తిశ్రద్ధలు ఏర్పడునట్లు చేయడమే ఈ చిన్ని పుస్తక ఆశయం.

శాస్త్రాలలో భగవంతునికి చెప్పబడ్డ లక్షణాలలో ఈ క్రింది మూడు లక్షణాలు శ్రీ సుబ్బరామయ్య సార్ వద్ద సంపూర్ణంగా ప్రకటమవుతాయి.

1. సర్వవ్యాపకుడు: అందుగలడిందులేడని సందేహము వలదు అన్నట్లు విశ్వమందంతనూ ఉన్నవాడు.
2. సర్వజ్ఞుడు: సర్వవిషయాలు తెలిసినవాడు. సృష్టిలోని ప్రతిదాని గురించి భూత భవిష్యత్, వర్తమానములన్నీ తెలిసినవాడు
3. సర్వసమర్థుడు: ఏమైనా చేయగల సామర్థ్యము గలవాడు

శ్రీ శ్రీ శ్రీ పెసల సుబ్బరామయ్యగారు భక్తులకు అనుగ్రహించిన అనుభవాలను బట్టి ఆయన సాక్షాత్తు భగవంతుడు అని తెలుస్తుంది. అంతేగాక సార్ పాటించిన కఠోర నియమపాలన, గురుసేవ అసామాన్యమైనది. అంతటి మహనీయుని జీవిత విశేషాలు ఈ గ్రంథంలో కూర్చబడినవి. ఈ గ్రంథ కూర్పుకు, ముద్రణకు ముఖ్య కారణాలు :

1. సార్ జీవిత విశేషాలను తలుచుకుంటూ సార్ సాంగత్యం నిరంతరం పొందాలని
2. సార్ తో అనుబంధమున్న వాళ్ళందరికీ మార్గదర్శకంగా సహకరించాలని
3. గురుసేవగా గురువు యొక్క చరిత్రని నలుగురితో పంచుకుని నిరంతరం మాలో గురుస్మరణ జరగాలన్న సంకల్పమే

# శ్రీ పెసల సుబ్బరామయ్య సార్ (గొలగమూడి) జీవితము

## సార్ బాల్యం- విద్యాభ్యాసం

శ్రీ పెసల శేషయ్య మరియు శేషమ్మ అనే పుణ్యదంపతులకు 1939సం|| లో శ్రీ పెసల సుబ్బరామయ్య గారు (సార్) జన్మించారు. సార్ తండ్రిగారు దైవభక్తి పరాయణులు. రోడ్డు మీద నడుస్తున్నప్పుడు అడ్డంగా పడివున్న ముళ్ళ కంపలను తీసివేసేవారు. చిన్నప్పుడే సార్ తండ్రిని కోల్పోయారు. సార్ అమ్మగారు అంగడి పనులు చూసుకునేవారు. ఎంత పని వున్నా రోజు దేవునికి దీపం వెలిగించి ఉన్నదానితో నివేదించి, వడ్లు దంచుకుని తినేవారు.సార్ కి చిన్నప్పటి నుండి దైవ కార్యక్రమాలు, సాటి వారికి సహాయం చేసేవారు. వాటిలో మచ్చుకు కొన్ని

1. సార్ చిన్నప్పుడు 8-10 సం వయసులోనే “మందిరాలలో దీపారాధన చేయకుండా బీడు పెడితే ఊరుకు అరిష్టమని” వారి టీచర్ చెప్పిన మాటకు స్పందించి నూనె, బియ్యం మొదలుగునవి సమీకరించి వారం వారం పూజ భజన నైవేద్యం చేయటం శ్రీ సార్ కున్న అన్ని జీవుల మేలుకు స్పందించే సంస్కారాన్ని, భగవంతునిపై విశ్వాసాన్ని తెలుపుతాయి. ఇవే ధర్మాచరణకు పునాదులని శ్రీ భరద్వాజమాష్టారి వివరణ.

2. ఇంచుమించు ఇదే వయసులో సార్ ఇంటికి దగ్గరలో ఒక పెద్దావిడ ఒళ్ళంతా జిలతో బాధ పడుతూ రాత్రింపగళ్ళు భాధతో అరుస్తుంటే సార్ వెంటనే స్పందించి ఎంతో సమయస్ఫూర్తితో హాస్పిటల్ కు 10 కి.మీ. ఎవరిపై ఆధారపడకుండా తీసుకు వెళ్ళి ఆవిడ భాధను తీర్చారు. “ఇతరులు నీకేమి చేయాలనుకుంటావో అది ఇతరులకు చేయి” అనే ధర్మాచరణ మూల సూత్రాన్ని ఎంతగా జన్మ సంస్కారంగా మారేంతగా జీర్ణించుకున్నారో తెలుపుతుంది ఈ సంఘటన.

3. యుద్ధ సైనికులు గాయ పడ్డప్పుడు సహాయ నిధి కోసం శ్రమించడం, దగ్గరలో ఇల్లు అంటుకుంటే ఎవరూ సహాయం చేయక చూస్తుంటే చిన్న పిల్లవాడే అయినా గోడ ఎక్కి నీళ్ళు పోసి ఆర్పడం, ప్రాక్టికల్ ఎగ్జామ్స్ కి టైం అయిపోతున్నా లెక్కించక ఒకావిడ కాలులో ముల్లు దిగి రక్తం వస్తుంటే ఫోర్సెప్స్ తో బైటకు తీసి

వారి ప్రమాదం, భాధ తొలగించటం వరకూ ఎన్నో సన్నివేశాలలో ఇతరుల బాధలకు స్పందించడం వారికి ఎన్నో జన్మలుగా ఆర్జించిన అత్యుత్తమ ధర్మ సంస్కారంగా కనపడుతుంది.

4. సార్ చిన్నతనంలో ఒక వ్యక్తి కూరలమ్ముకునే వాని బండిని గుద్ది అతనికి నష్టం కలిగించి పైగా అతనినే తిడుతుంటే సార్ దారినపోతూ చూచి ధర్మం వైపు నిలిచి బండివానికి డబ్బులిప్పించారు. అలాగే కొద్దిగా పెద్దవయసు వచ్చాక, ఒకసారి వారింటి దగ్గరలో ఒక భర్త భార్యను, రోడ్డుమీదబట్టలు ఆమె వంటిపై నిలవనంతగా లాగి కొడుతుండగా అచ్చట అందరూ చోద్యం చూస్తుంటే, సార్ సమయస్ఫూర్తి, ధైర్యంతో ప్రతిఘటించి, ఆ అబలను కాపాడారు. ధర్మంలో భాగంగా అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకునే వారు అధర్మంతో చేతులు కలిపినట్లే అని కొద్ది వాక్య / కార్య ప్రతిఘటన ఐనా చూపాలని శ్రీ మాస్టర్ చెప్పినదానికి ప్రతిబింబంగా నిలుస్తాయి. అధర్మాన్ని నిరసించే ఈ గుణమే సార్ ఇల్లు తగాదాలో అన్యాయంగా అధర్మం జరిగినప్పుడు మరింతగా భగవంతునితో విన్నవించుకునేలా, ఆయనపై ఆధార పడేలా చేసింది.

సార్ దిగుడు బావుల్లో పై నుంచి దూకి ఈత కొట్టేవారు. ఒకసారి అలా కొట్టటంలో కుడి చేతి గూడ స్థానభ్రంశం అయ్యి జారింది. నొప్పి తగ్గిన తర్వాత గూడను సరిచేసుకుని ఇంటికి వెళ్లారు. ఆర్ధిక ఇబ్బందుల వలన సార్ అమ్మగారు ఇంకా బాధపడతారని సార్ చెప్పలేదు. ఏ వైద్యం చేయించలేదు. జీవితాంతమూ అలానే ఉండి గూడ జారినప్పుడల్లా సరి చేసుకుంటూ ఉండేవారు.

సార్ అంటే వాళ్ళ తల్లిగారికి ప్రత్యేకంగా ఇష్టం, ఎందువలన అంటే ఆహారానికి ఏమాత్రం ఇబ్బంది పెట్టకుండా ఉన్నదానితో గమ్మున తిని వెళ్ళేవారు. ఏమీ లేకపోతే సార్ మజ్జిగన్నం లో ఎర్రగడ్డ కొరుక్కుని తిని వెళ్లిపోయేవారు.

సార్ తమ టీచర్ గారికి ఇంటిపనులు చేసేవారు. అందువలన సార్ కు పార, గడ్డపారలతో పనిచేయటం బాగా వచ్చింది. సార్ 72 సంవత్సరముల వరకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా ఏ పనైనా అలవోకగా నైపుణ్యంతో చేసేవారు.

సార్ అన్నయ్య నెల్లూరు వెళ్ళి 6 వ తరగతి నెల్లూరులో చదువుకున్నారు. నెల్లూరు నుండి ఇంటికి వచ్చేటప్పుడు అయన చేత పాత "The Hindu" న్యూస్ పేపర్లు తెప్పించుకుని, సార్ వాటిని చదువుతూ కష్టమైన ఇంగ్లీష్ పదాలను గుర్తుపెట్టుకుని అర్ధం తెలుసుకునేవారు.

శ్రీ సార్ 6 వతరగతి చదువుకునే సమయానికి వారి అన్నగారిని సార్ వాళ్ళ తల్లిగారు నెల్లూరు పంపి చదివిస్తే వారు సరిగా చదవక ఆటలలో మునిగారు. ఆ కారణం వల్ల సార్ ను వాళ్ళ తల్లిగారు పై చదువులకు నెల్లూరు పంపక వారి ఊరైన చెముడుగుంటలోనే 6 వ తరగతి మూడుసార్లు చదివించారు. సార్ వాళ్ళఊరికి కొత్తగా వచ్చిన teacher ఈ విషయం, సార్ చురుకుదనం గుర్తించి సార్ తో 'నువ్వు బాగా చదువుతావు, మీ అమ్మ ఒప్పుకోవాలంటే రెండు రోజులు నిరాహార దీక్ష చేయమని' సూచించారు. సార్ ఇంట్లో అడ్డంగా మూడు పీటలు పరుచుకుని వారి teacher చెప్పినట్లే రెండు రోజులు పచ్చి మంచి నీళ్ళు కూడా తాగకుండా ఉన్నారు. ఒకరోజు తినకపోతే వాడే దారిలోకి వస్తారనుకున్న వాళ్ళ తల్లిగారు రెండో రోజు కూడా తినకపోయేసరికి ఆవిడ భయపడి ఇంకేమీ చేసేది లేక సార్ కోరికను ఆంగీకరించారు. సార్ హైస్కూల్ చదువులుఎన్నో కష్టాలకోర్చి వారి మేనమామ గారింట్లో పూర్తి చేసారు. సార్ శ్రద్ధ పట్టుదలలు ఈ సన్నివేశాలలో గుర్తించ వచ్చు.

10 వ తరగతి దాక మేనమామ ఇంట్లో ఉండి చదువుకున్నారు. మేనమామ గారింట్లో నీళ్ళు తీసుకురావడం, వాకిలి కల్లాబు చల్లటం వంట పనులు చేస్తూ, అంగడి చూసుకుంటూ సమయం దొరికినప్పుడల్లా చదువుకునే వారు. 10వ తరగతి తర్వాత వాళ్ళ మేనమామ ఇంటి నుండి రావాల్సి వచ్చింది.

శ్రీ సార్ కాలేజికి రోజు 8 KM నడచి వెళ్లి నడిచి వచ్చేవారు. అలా చదవటం కష్టమని వైశ్య హాస్టల్ లో సీట్ కోసం రెండుసార్లు ప్రయత్నిస్తే రాలేదు. మూడోసారి వెళ్లి కనీసం సామాన్లు, పుస్తకాలు పెట్టుకోవటానికి వీలు కల్పించమని అడిగినా, ఆఫీస్ వారు సీట్ లేదని చెప్పారు. సార్ బయటకు వెళుతూ గేటు దగ్గరకి వచ్చేసరికి రాధయ్య(గారు) అనే సీనియర్ స్టూడెంట్ 'ఎవరు రా అది?' అని ప్రశ్నించాడు. సార్ "దొంగని" అని చెప్పేసరికి, దూరంగా కూర్చున్న రాధయ్య(గారు) సార్ దగ్గరకి వచ్చి చూచి దొంగవు కావులే కానీ ఎందుకు వచ్చావు అని విచారించారు. సార్ తమ

విషయం చెపితే, ఆయన సార్ కి వచ్చిన మార్కులు చూసిన అతను చాలా అభినందించి, ఇన్ని మార్కులు వచ్చిన నీకు ఎవడురా సీట్ ఇవ్వనని చెప్పాడు అని,సార్ ను మరలా హాస్టల్ ఆఫీస్ లోకి తీసుకు వెళ్లి ఇతనికి సీట్ ఇవ్వాలనిగట్టిగా చెప్పాడు. (ఆజానబాహువు) రాధయ్య(గారి) గురించి తెలిసిన ఆ ఆఫీస్ వారు సార్ కి హాస్టల్ లో సీట్ ఇచ్చారు. సార్ నడిచి అయినా చదువుటకు సిద్ధపడ్డ పట్టుదలను చూసి భగవంతుని కృప వచ్చినట్లుంది. అంతటితో సార్ కి హాస్టల్లో ఫ్రీ Accomodation దొరికింది. ఆ హాస్టల్ లో విద్యార్థులు ప్రతిరోజు ఒక్కరు చొప్పున మార్కెట్ కి వెళ్లి కూరగాయలు, పాలు తీసుకురావాలి. కానీ ఎక్కువమంది విద్యార్థులు అలా చేసేవారు కాదు. వారి బదులు సార్ అవకాశం ఉన్నప్పుడల్లా రోజువారీ కూరగాయలు, పాలు తీసుకువచ్చేవారు. ఎవరికీ ఋణపడరాదనేది సార్ కు సహజ సిద్ధమేమో! అంతేగాక రోజూ శ్రద్ధగా చదువుకునేవారు. సార్ డిగ్రీ చదివేటప్పుడు ఆ హాస్టల్ నుండి సార్ ఒక్కరే పాసయ్యారు. అంతేగాక VRC కాలేజీలో సార్ కి మూడో ర్యాంక్ వచ్చింది. సార్ జీవితాంతం రాధయ్యగారు చేసిన మేలుని తలుచుకునేవారు. ఆయనంటే ఎంత అభిమానమో!

## ఉద్యోగం - వివాహం

సార్ డిగ్రీ పూర్తిచేసిన వెంటనే ఉద్యోగం రాలేదు. తన వల్ల వారి అమ్మగారికి ఇబ్బంది అవకూడదని ఇంట్లో ఉన్నప్పుడు వంట చెరుకు కొట్టి తీసుకు వచ్చేవారు. అంతేగాక డిగ్రీ చదువుకున్న సార్, రైల్ ట్రాక్ మీద గ్యాంగ్ పనికి వెళ్లారు. వాళ్ళు ఇంత చదువుకున్న వాడిని చేర్పించుకోము అని చెప్పారు. తర్వాత కొన్నాళ్ళకు చిత్తూరులో (200 కి.మీ దూరంలో) టీచర్ ఉద్యోగాలు ఉన్నాయని వెళితే, అక్కడ ఆఫీసర్ సార్ కి సింగరాయకొండ దగ్గర ఊళ్లపాలెంకి పోస్టింగ్ ఇచ్చారు.

సార్ కి ఊళ్లపాలెంలో రాజగోపాల్ గారు సహోద్యోగి. ఇంగ్లీష్ అయ్యవారు. రాజగోపాల్ గారు చాల మర్యాదస్తులు, పరోపకార బుద్ధి కలిగినవారు. సార్, ఇంకొక టీచర్ కలిసి ఒకే రూమ్ లో ఉండేవారు. సార్ ఆహారం విషయంలో ఇబ్బంది పడుతున్నారని రాజగోపాల్ గారు గమనించి సార్ కి చెప్పకుండా వంట సామాన్లు తీసుకు వచ్చి వంట నేర్పించారు. ఆ మేలుని సార్ ఏనాడూ మరిచిపోలేదు. సార్ కి 65 సంవత్సరాల వయస్సులో కూడా రాజగోపాల్ అయ్యవారి గురించి వస్తే నుంచున్న

వారు నుంచున్నట్లే గంటల తరబడి రాజగోపాల్ అయ్యవారు చేసిన సహాయం గురించి చెప్పేవారు. ఆయన చేసిన దానికి కృతజ్ఞతగా సార్ ఏం చేసారో ముందు ముందు తెలుస్తుంది.

సార్ ఊళ్లపాలెం లో ఉద్యోగం చేస్తున్నప్పటి నుండి ప్రతి నెలా వాళ్ళమ్మ గారికని ఊళ్ళో ఉన్న అన్నయ్యకు డబ్బులు మని ఆర్డర్ చేసేవారు.

ఊళ్లపాలెం స్కూల్లో సరిగ్గా చదవలేదని ఒక అమ్మాయిని అరిచారు. విషయం తెలిసిన ఆ అమ్మాయి అన్నయ్య స్కూల్ కి వచ్చి సార్ ని నానా బూతులు తిట్టి వెళ్ళాడు. సార్ ఈ విషయం ఎవ్వరికీ చెప్పలేదు. అక్కడున్న అటెండర్ రాజగోపాల్ అయ్యవారికి చెప్పాడు. కొన్ని రోజులు అయిన తర్వాత రాజగోపాల్ గారు సార్ ని హెడ్ మాస్టర్ ఇంటికి తీసుకు వెళ్లి, అక్కడ హెడ్ మాస్టర్ కి మొత్తం విషయం చెప్పారు. తర్వాత ఆఖరి పరీక్షల అప్పుడు హెడ్ మాస్టర్ ఆ అమ్మాయికి హాల్ టికెట్ ఇవ్వలేదు. వాళ్ళ అన్నయ్యని తీసుకు వచ్చి సార్ కి క్షమాపణ చెప్పమని ఆదేశించారు. ఆ అమ్మాయి వాళ్ళ నాన్నని తీసుకు వస్తే, మీ అన్నయ్యను తీసుకురమ్మంటే మీ నాన్నను తీసుకు వచ్చావే అని అరచి పంపించేసారు. తర్వాత వాళ్ళ అన్నయ్యను తీసుకు వచ్చి సార్ కి క్షమాపణ చెప్పిన తర్వాతనే ఆ అమ్మాయికి హాల్ టికెట్ ఇచ్చి పరీక్ష వ్రాయించారు. సార్ ఆ హెడ్ మాస్టర్ గురించి చాలా గొప్పగా చెప్పేవారు. ముఖ్యంగా ఆ అమ్మాయి అన్నయ్య చేత క్షమాపణ చెప్పించిన దానికన్నా తన స్టాఫ్ గురించి ఆయన తీసుకున్న శ్రద్దకి, ఆయనకున్న గౌరవానికి సార్ దాసోహం అనేవారు.

సార్ కి తలుపూరు ట్రాన్స్ఫర్ అయ్యింది. అక్కడకు వచ్చాక వివాహం జరిగింది.

సార్ తన చిన్నతనంలో ఆర్థిక పరిస్థితి వల్ల తమ ఇంటి యజమాని ఇంట్లోంచి వెళ్ళమని సామాన్లు బయట పెట్టిస్తున్నప్పుడు, సార్ మేనమామ వచ్చి డబ్బులిచ్చి ఆదుకున్నారు. ఆ కృతజ్ఞతగా ఆ మేనమామ పెద్ద కూతురుని పెళ్లి చేసుకుందామనుకున్నారు. సార్ వాళ్ళ తల్లిగారికి, అన్నయ్యకు ఇది ఇష్టం లేదు. ఎందువలన? అయిన సంబంధం, ఎక్కువ కట్నం రాదని! కానీ సార్ పట్టుపట్టి కుమారి శేషమ్మను (ఇప్పటి నుండి అమ్మగారు అని సంబోధిస్తాము) పెళ్లిచేసుకున్నారు.

అమ్మగారికి ముగ్గురు చెల్లెళ్లు. 5 వ తరగతి వరకు మాత్రమే చదివారు. చాల గారాబంగా పెరిగారు. సార్ వాళ్ళ అమ్మగారు తన కోడలిని చదువు రాదని, కట్నం తేలేదని సాధించేవారు. సార్ మాత్రం తనని బాగా కష్టపడి పెంచిందని తమ తల్లిగారిని ఏమనేవారు కాదు. పైగా అమ్మగారితో ఒక ఒప్పందం చేసుకున్నారు – "మా అమ్మ అరిస్తే నేను నిన్ను ఊరికే తిడతాను. అప్పుడు ఆమె శాంతిస్తుంది. ఏమనుకోవద్దని". అట్లానే చేసేవారు. అమ్మగారు మాత్రం అప్పుడప్పుడు సార్ తో "అందరూ నాకు చదువు రాదని అంటున్నారు, నన్ను చేసుకుని మీకు కూడా బాధగా ఉందా?" అంటే సార్ "నేనంటే నువ్వు బాధపడాలి కానీ ఇంకొకళ్ళు అంటే ఎందుకు బాధపడటం, నాకు బుద్ధి, గుణం మాత్రమే కావాలి. అవసరమైతే ఆ చదువు నేనే నేర్పుతాను" అని సముదాయించేవారు.

సార్, అమ్మగారికి ఇద్దరు పిల్లలు – సుమతి, శేషయ్య. సుమతి గారు SBIలో పనిచేస్తున్నారు. ఆమెకి పంజాబ్ నేషనల్ బ్యాంకులో పనిచేసే శ్రీ నాగభూషణం గారితో వివాహం జరిగింది. వాళ్ళకి చైతన్య అనే మగ పిల్లవాడు.

శేషయ్య 5 వ తరగతిలో పరీక్షలు వ్రాస్తూ ఉంటే, ఆ ఇన్విజిలేటర్ కి శేషయ్య సార్ పిల్లవాడని తెలుసు. అందువలన ఆయన శేషయ్యకు కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పబోతే శేషయ్య "నువ్వేమి అయ్యవారివి, నేను అలా వ్రాయను" అని చెప్పాడు. తర్వాత ఆయన సార్ ని కలిసినప్పుడు సార్ తో **'నిప్పు లాంటి బిడ్డను కన్నావయ్యా'** అని కితాబు ఇచ్చి వెళ్ళాడు.

గొర్రె వేణుగోపాల్ గారి అన్నయ్య ఇలా చెప్పారు: 'సార్ క్లాసుకి వచ్చి బాగా చదువుకోవాలి, నేను ఎవరినీ కొట్టను అని చెపుతున్నారు. ఇంతలో ఏదో శబ్దం విని కారు వచ్చిందేమోనని ఆ క్లాసు లీడర్ లేచి నిలుచున్నాడు. సార్ ఒక్క దెబ్బ వేసి ఇలా చేస్తే కొట్టానని చెప్పలేదు కదా! అని. అంతే అప్పటి నుండి సార్ (సుబ్బరామయ్య అయ్యవారంటే) అంటే అందరికీ భయమే! కానీ అదేమి చిత్రమో ఆ పిల్లలే సార్ తో పాటు ఎప్పుడూ ఇష్టంగా తిరుగుతూ ఉండేవారు.

తలుపూరులో స్కూల్ అయిన తర్వాత ఇంటి ప్రక్క పిల్లలకు ఫ్రీగా ప్రైవేట్ చెప్పేవారు. ఒకతను అయితే అమ్మగారి దగ్గరకు వచ్చి 'అమ్మగారు! నేను చదవలేను.

మీరేదైనా పని ఇవ్వండి' అని సార్ ఇంటి పనులు చేసేవాడు. తలుపూరు నుండి కలిచేడుకి ఉద్యోగం ట్రాన్స్ఫర్ అయ్యింది.

ఊళ్లపాలెంలో జరిగిన సంఘటన లాగానే కలిచేడు వచ్చిన తర్వాత సార్ ఒక విద్యార్థిని అరిచారు. ఆ విద్యార్థి తండ్రి వస్తే ఆ హెడ్ మాస్టర్ "మా అయ్యవారికి కొంచెం తొందరెక్కువలే" అని అన్నారు. బహుశా ఆ హెడ్ మాస్టర్ ఆ ఒక్క మాటతో సమస్యను పరిష్కరించుదామనుకుని ఉండవచ్చు. ఆ విషయం సత్సంగంలో చెప్పినప్పుడల్లా సార్ ఆ హెడ్ మాస్టర్ తన స్టాఫ్ గురించి తక్కువ చేసి మాట్లాడటం ఎంత తప్పో అని వాపోయేవారు. అందువలన ఒక అధికారి ఎంత జాగ్రత్తగా ఉండాలో చెపుతున్నారు.

సార్ ఉద్యోగ ధర్మాన్ని చాలా ఖచ్చితంగా నిర్వర్తించేవారు. పరీక్షలు అయిన మరురోజుకు పిల్లలకు వారి ప్రశ్నాపత్రాలు దిద్ది ఇవ్వటం, పరీక్షలో ఏ ఒత్తిళ్ళకు లొంగక ఇన్విజిలేషన్ చేయటం, సమయానికి స్కూల్ కు రావటంమొ|| కొన్ని ఉదాహరణలు. సార్ పాఠం చెపితే అర్థం కాకపోవటం ఉండదు అనిసార్ విద్యార్థి వేణుగోపాల్ గారు అంటారు. అంతేగాక సార్ ఒక్కరే నలుగురు పిల్లలతో బాడ్మింటన్ ఆడేవారు. సార్ స్కూల్ లోని పిల్లలు చదవకపోతే కొట్టేవారు కూడా!

అమ్మగారి మాటలలో ఇలా చెప్పారు. "పగలనక, రాత్రనక ఏదో పనులు మీద తిరుగుతుంటాడు. ఒక్కొక్కసారి చెప్పకుండా నెల్లూరు వెళ్లిపోయవాడు. ఎవరికైనా డబ్బులు ఇచ్చారని అడిగితే నీకేం తక్కువ చేయను అనేవారు. ఒక్కొక్కసారి కోపం వచ్చేది. కొట్టినంత చేసేవారు. అడగకుండా గమ్మున ఉంటే సార్ గమనించి "ఏం నాతో మాట్లాడవా?" అని నవ్వుతూ అడిగేసరికి అమ్మగారు మరలా మాట్లాడటం చేసేవారు".

కలిచేడులో సార్ ఇల్లు కట్టుకున్నారు. సార్ కి పిల్లలు పుట్టిన తర్వాత నుండి ఆయాసం ప్రభావం ఎక్కువైంది. చలికాలంలో చాలా ఇబ్బంది పడేవారు. రాత్రుళ్ళు నిద్ర లేకుండా ఉండేది. ఒక్కొక్కసారి ఆ బాధ భరించలేక నేను ఏ లారీ క్రింద పడి చచ్చిపోతానని అనేవారు. దానితో అమ్మగారు కూడా నిద్ర పోకుండా సార్ ని కనిపెట్టుకుని ఉండేవారు.

కలిచేడులో అమ్మగారు తెల్లవారుజామున 4 గంటలకు 200 మీటర్ల దూరం దూరం వెళ్లి మంచి నీళ్ళు తీసుకు వచ్చేవారు. సార్ వాళ్ళ చెల్లెలి పిల్లలు, సార్

అమ్మమ్మ గారు కూడా ఇంట్లో ఉండేవారు. మొత్తం సార్ ఇంట్లో ఎనిమిదిమంది ఉండేవారు. అమ్మగారు ఒక్కరే పనిచేసేవారు. అందరికీ ఫలహారాలు పెట్టేసరికి ఉదయం 10:30 అయ్యేది. అప్పుడు ఫలహారం చేసి, బట్టలు ఉతికి, మధ్యాహ్నం భోజనాలు చేసేసరికి దాదాపు మధ్యాహ్నం 4 గంటలు అయ్యేది. రాత్రికి పడుకునేసరికి దాదాపు 11గంటలు అయ్యేది. సార్ వాళ్ళ తల్లిగారు అమ్మగారిని మాటలతో ఇబ్బంది పెట్టేవారు (ఒక రకంగా చూస్తే శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామి భార్యను వాళ్ళ తల్లిగారు సాధించినట్లుగా ఉంటుంది). అమ్మగారు అన్ని సంవత్సరాలలో వాళ్ళ అత్తగారి మాటకు ఒకటి రెండు సార్లు తిరిగి సమాధానం చెప్పి ఉంటారు. అలా చేసినందుకు సార్ అమ్మగారిని మందలించారు కూడా! తర్వాత అమ్మగారికి సార్ తనదైన శైలిలో క్షమాపణ చెప్పేవారు. అమ్మగారు సార్ ఇంటి సరుకుల కోసం ఇచ్చిన డబ్బును చాలా పొదుపుగా వాడేవారు. డబ్బులు దాచేవారు.

## దైవ ఘటనలు – శ్రీ శ్రీ శ్రీ భరద్వాజమాష్టారి పరిచయం

సార్ వాళ్ళ ఊరిలో ఒకరితో ఇంటి స్థలంవద్ద వివాదం ఏర్పడినప్పుడు ఆ వ్యక్తి అన్యాయంగా స్థలమాక్రమిస్తే సార్ వారితో దెబ్బలాటకు బదులుగా ఊరి వెలుపలి శివాలయమునకు వెళ్ళి అచట ధర్మంగూర్చి భగవంతునితో ఎన్నోరోజులు ఏకాంతంలో తగవులాడేవారు. ధర్మం ఓడినందుకు,లోకం తీరు, మనుషుల నైజం గూర్చి భగవంతునితోనే విచికిత్స చేసుకుంటూ ఏకాంతంగా చాలా సమయం గడిపే వారు. సార్ కు లౌకిక మనుషుల నైజం జుగుప్స కల్గించి భగవంతుని వైపు మ్రొగ్గు కల్గించిన సంఘటనల్లో ఇది ఒకటి. ఇదే జన్మ సంస్కారము (లో మనిషికి మనిషికి మార్పు) అని సార్ “స్వామి సన్నిధి” పుస్తకంలో శ్రీ రోశిరెడ్డిగారి సంఘటన వ్రాసినప్పుడు తెలుపుతారు.

శ్రీ రామకృష్ణ పరమహంస పుస్తకంలో "భగవంతునిగూర్చి ఏడ్చేవారేరి? అందరూ భార్యాబిడ్డలు లేదా సంపదలు తదితరాలగూర్చి ఏడ్చేవారే!" అన్నమాట చదివినతర్వాత కొన్ని రోజులు ఏకాంతంలో భగవంతునికై పరితపించేవారు. ఏకాంతంలో వెక్కి వెక్కి ఏడ్చే వారట. వేసవి సెలవలలో ఉదయం వెళ్లి సాయంత్రం వచ్చేవారట. “అలా ఏడుపు ఎందుకు, ఎలా వచ్చిందో నాకే తెలియదు” అని సార్ అంటారు. తరువాత స్వామి సేవకు వచ్చాక స్వామి వద్ద ఏడవటమే గొప్ప

ఆయుధమని, పాపం నిండుగా ఉండటం వాళ్ళ ఆయన వద్ద (స్వామికోసం) ఏడుపు రాదని చెప్పేవారు. "భగవంతునికై చింతించు వారు ధన్యులు, వారు ఓదార్పబడుదురు" అన్న క్రీస్తు మాట సార్ పట్ల ఎలా నిజం అయిందో ఇచ్చట చూడగలము.

సార్ స్థలం ఆక్రమించిన వ్యక్తి వచ్చి బెదిరించినప్పుడు ఎవ్వరూ ముందుకు రానిది సార్ సహోద్యోగి టి.వి.శేషగిరిరావు గారు ఒక్క ఉదుటున గొడ్డలి పట్టుకుని వ్యక్తి మీదకు వెళ్లేసరికి అతను భయపడి వెళ్ళిపోయాడు. సార్ శ్రీ భరద్వాజ మాష్టారిని కలవమని చెప్పింది సార్ విద్యార్థి, మాష్టారి విద్యార్థి శ్రీ అచ్చి రమణయ్య గారు అయితే సార్ ను బలవంతంగా ప్రోద్బలం చేసి భరద్వాజ మాష్టారి దగ్గరకి తీసుకువెళ్ళింది మాత్రము శ్రీ శేషగిరిరావుగారు. అందువలన సార్ శ్రీ శేషగిరిరావు గారికి చేసిన సహాయం అమోఘం!

సార్ ఎలా భరద్వాజ మాష్టారిని కలిసింది సార్ మాటల్లోనే ఎంతో హృద్యంగా ఉంటుంది. ఆ విషయాన్ని ఈ క్రింద వెబ్ సైట్ లింకుల్లో ఆస్వాదించండి.

ఆడియో : http://saimastersevatrust.org/Speeches/Sammelanam-08/SirSpeech09part1.mp3

పుస్తకం : నాకు తెలిసిన మాస్టారు – 2 వ పేజి

http://www.saimastersevatrust.org/Books/NTM_Part_1.pdf

శ్రీ భరద్వాజ మాష్టారి గారి పరిచయంతో సార్ జీవితం నూతన పర్వం తొక్కింది. ఎందుకు మాష్టారి గారి దగ్గరకు వెళ్ళేవారో సార్ మాటల్లో "అక్కడకు వెళ్ళితే జ్ఞాన ప్రవాహం అలా వస్తూ ఉండేది. నేనేమీ కోరికలతో వెళ్ళలేదు. కానీ అక్కడకు వెళ్లి వస్తే నేను ఇంట్లో ప్రశాంతంగా ఉండేవాడిని. అంతకు ముందు పిల్లలు దూరంగా అల్లరి చేసినా అరిచేవాడిని, మాష్టారి దగ్గరకి వెళ్లి వచ్చిన దగ్గరనుండి పిల్లలు నా నెత్తి మీద నీళ్ళు పోసినా ఎందుకురా పోస్తారు! అని నెమ్మదిగాఅనేవాడిని తప్ప ఏమీ అరిచేవాడిని కాదు. ఈ విషయం ఆమె (అమ్మగారు)గమనించి, నా దగ్గర డబ్బు లేకపోయినా ఆమె ఇంటి సరుకులు కోసం ఇచ్చిన డబ్బులో దాచినవి నాకు ఇచ్చి శ్రీ భరద్వాజ మాస్టర్ దగ్గరకు వెళ్ళమని ప్రోత్సహించేది".

సార్ భరద్వాజ మాస్టారుతో అనుబంధాన్ని శ్రీ సాయి మాస్టర్ బోధామృతం గ్రంధములో వివరంగా చదివి తరించ వలసినదే కానీ క్లుప్తంగా వ్రాయలేము. కానీ మాష్టారి సాంగత్యంతో సార్ పొందిన ఉత్తమమైన మార్పు, ఆధ్యాత్మిక పరిణితి కొద్దిగానైనా ఇక్కడస్మరిద్దాము. శ్రీ మాష్టారి సాంగత్యానికితెలియని తపనతో ప్రతి వారం సార్ విద్యానగర్ వెళ్ళేవారు. అచ్చటఏ చిన్న పని ఉన్నా సేవ చేసే ఆస్కారం కలిగించుకొని శ్రద్ధాభక్తులతో చేసేవారు. అందరికి అన్నం వండి పెట్టటం, సాయిమందిర నిర్మాణంలో పాల్గొనటం, క్యూరింగ్ మొ|| పనులు ఎంతో శ్రమకోర్చి సాయిబాబా సేవగా చేసేవారు. శ్రీమాష్టారి సలహాను అనుసరించి ఇంటి వద్ద, దేవాలయంలో, స్కూల్ లో సత్సంగం చేయటం, సంవత్సరాల పర్యంతం కాలం ఒకే సమయంలో –మనస్సు భగవంతునికి ఇవ్వటం హృదయపూర్వకంగా, శ్రద్ధ పట్టుదలతో చేసారు కనుకనే శ్రీ పూండి స్వామి ఆశీస్సుల వలన కాలం తెలియని ధ్యానస్థితి కల్గింది. కొన్నిరోజులపాటు సహజంగా అలౌకిక ఆనందము, నిరంతర భగవత్ తాదాత్మ్యం కల్గింది.

శ్రీ భరద్వాజ మాష్టారి ప్రోద్బలంతో సార్ శ్రీ వెంకయ్యస్వామిని దర్శించుకున్నారు. ఒక సంవత్సరం చలికాలంలో సార్ కి ఆయాసం వచ్చినప్పుడు కలిచేడులో వచ్చి ఉన్న శ్రీ వెంకయ్యస్వామి సన్నిధికి వెళ్ళగానే ఆయాసం తగ్గి తెల్లవార్లూ హాయిగా ఆరు బయట నిద్రపోయారు. ఇలా ఒక్కసారి కాదు ఎన్నోసార్లు జరిగింది. సార్ కి ఒక సందేహంవచ్చింది - 'ఆయాసం తగ్గటం స్వామి సన్నిధి వల్ల కాదు, స్వామి దగ్గర ఉండే అగ్ని వల్లనా అని'. తర్వాత రోజు స్వామి దగ్గరకు వెళ్ళితే స్వామి జావ త్రాగుతున్నారని రేక అడ్డు పెట్టి ఉన్నారు. సార్ ను చాల దూరంలో ఆపేసారు. రేక అడ్డు పెట్టటంలో అగ్ని కనపడలేదు. ఆ రోజు కూడా హాయిగా నిద్ర పట్టింది. అంతటితో స్వామి కృప వలన మాత్రమే ఆయాసం తగ్గుతోందని తెలుసుకున్నారు.

కలిచేడులో ప్రసాద్ గారనే ఆయన గవర్నమెంట్ ఆఫీస్ లో పని చేసేవారు. సార్ కి ఆయనతో పరిచయ మేర్పడింది. ఆయన భగవద్గీత చెప్తానని చెపితే సార్ శ్రీ భరద్వాజ మాష్టారిని నేర్చుకోమంటారా వద్దా అని అడిగారు. భరద్వాజ మాస్టారు సాయిబాబానే అలా పంపించారు. మంచి అవకాశం నేర్చుకోమన్నారు. ప్రసాద్ గారు చాలా స్ట్రిక్ట్. రాత్రి 8 గంటలకి భగవద్గీత చెప్పటం మొదలుపెడితే అలా చెప్పుతూనే

ఉండేవారు. ఎవరైనా ఆవలిస్తే మాత్రం "ఓం తత్సత్" అని చెప్పటం ఆపేసేవారు. కొన్నిసార్లు రాత్రి 12 గంటల వరకు ఆ క్లాసు జరిగేది. అన్నం తిని వెళితే ఆవలింతలు వస్తాయని సార్ క్లాసు అయిన తర్వాతే అన్నం తినేవారు. అమ్మగారు సార్ తో అన్నం తినేవారు. క్లాసులో చెప్పిన విషయాలు రాత్రికేవ్రాసి పొద్దున్నే 6 గంటల కల్లా ప్రసాద్ గారి ఇంటి తలుపు క్రింద సందు నుండి ఇంట్లోకి తొయ్యాలి. ప్రసాద్ గారు అవి చూసి సాయంత్రం ఆ పుస్తకాలు వెనక్కి ఇచ్చేవారు. సార్ అలా చేయటం ఏనాడూ తప్పలేదు ! సార్ కు భక్తి యోగం చాల ఇష్టం. తరచూ భక్తుని లక్షణాలు గల పద్యాలు చెబుతుంటారు.

వేణుగోపాల్ గారు సార్ దగ్గర 8,9,10 వ తరగతులు చదువుకున్నారు. ఆయన మాటలలో "సార్ సైన్సు పాఠాలు ఎక్కువ భాగం ల్యాబ్ లో ఎక్స్పరిమెంట్ చేయిస్తూ చెప్పేవారు. ఉదాహరణకు కుళ్ళిన కోడిగుడ్డు వాసన సహజ వాయువు లాగా ఉండటం, ఆహారం తీసుకుంటే భూమ్యాకర్షణ శక్తి వల్ల కడుపులోకి వెళుతుందా లేదా శరీర కండరాల వల్ల వెళుతుందా అనే విషయాన్ని క్లాసులో ఒక పిల్లవాడి చేత శీర్షాసనం వేయించి వాడి నోట్లో తినే పదార్థం పెట్టి తింటే ఎలా ఉందో, కడుపులోకి ఎలా వెళుతోందో చెప్పించారు. అంటే అలా శీర్షాసనం పిల్లవాడి చేత చేయించే ముందర సార్ ప్రయత్నించి ఏమి జరుగుతోందో గమనించి ప్రమాదం లేదని గమనించి ఉండాలి!"

సార్ సైన్సుతో పాటు ఇంగ్లీష్ నాన్ డిటైల్డ్ చెప్పేవారు. ఆ చెప్పే విధానం చాలా సులువుగా ఉండేది. ప్రతి పాఠానికి 10 ఇంగ్లీష్ పదాలు చెపుతారు. ఆ పదాలతో 10 ఇంగ్లీష్ వాక్యాలు చెపుతారు. క్లాసులో ఒక్కొక్క విద్యార్ధి చేత ఒక్కొక్క వాక్యం చెప్పిస్తూ క్లాసు అయ్యేలోగా దాదాపు అందరి విద్యార్థులతో చెప్పించేవారు. అలా చెప్పించటం వలన క్లాసు పూర్తి అయ్యేసరికి అందరికీ ఆ పాఠం వచ్చేసేది."

సార్, శేషగిరిరావు అయ్యవారు మాత్రం ఎప్పుడూ పిల్లలకి ఎలా చెప్పాలో, ఏమి చెయ్యాలో అనేవి ఆలోచించటం, మాట్లాడుకోవటం చేసేవారు. సార్ కలిచేడు స్కూల్ మధ్యలో ఎప్పుడో నాటిన గానుగ చెట్టు ఇప్పుడు మహా వృక్షమై ఎందరికో నీడనిస్తోంది. సార్ ఏనాడూ ఏ పని చేసినా అది అవసరమైనదిగా, ఉపయోగపడేదిగా ఉండేది."

శ్రీ భరద్వాజ మాస్టారు వ్రాసిన శ్రీ సాయి లీలామృతం చదివిన తర్వాత ఆ పుస్తకాన్ని ఏ అధ్యాయానికి ఆ అధ్యాయం పేజిలు తీసి పిల్లలకి ఇచ్చి చదివించేవారు. సార్ చుట్టూ పిల్లలు తిరుగుతుండేవారు. మిగిలిన అయ్యవార్లందరూ వాళ్ళదగ్గరకు పిల్లలు రావట్లేదని వాపోయేవారు. సార్ క్లాసులో కూడా సాయిబాబా గురించి చెప్పేవారు. ఈ విషయమై మిగిలిన అయ్యవార్లు హెడ్ మాస్టర్ కి "సుబ్బరామయ్య అయ్యవారు పిల్లలకి సాయిబాబా గురించి చెపుతున్నాడు" అని ఫిర్యాదు చేసారు. ఆ హెడ్ మాస్టర్ స్వయంగా క్లాసు బయట నుంచొని సార్ క్లాసు చెపుతున్నప్పుడు గమనించారు. గంట సేపు పిల్లలు తమను తాము మరచి సార్ చెప్పే విషయాల్లో మునిగిపోయారు. ఇది గమనించిన ఆ హెడ్ మాస్టర్ మిగిలిన అయ్యవార్లతో మీరెప్పుడైనా పిల్లలు అంత సైలెంట్ గా ఉండేలా అలా పాఠాలు చెప్పరా? అని అడిగి ఇంకొకసారి సుబ్బరామయ్య అయ్యవారి మీద ఫిర్యాదులు చెప్పటం మానమన్నారు.

కలిచేడులో సాయిబాబా మందిర శంకు స్థాపన ముందు నుండి సార్ సత్సంగం చేయటం, చేయించటం వల్ల, ఎంతోశ్రద్ధతో శ్రీ మాష్టారి ఆశీస్సుల, సూచనలను అనుసరించటం వల్ల అచ్చట గొప్ప ఆలయం ఏర్పడి ఇప్పటికీ ఆ ఊరివారు శ్రద్ధతో సాయిని ఆరాధించటం, ఎన్నో దివ్యానుభవాలు కలుగుతున్నాయి.

## సార్ మాటల్లో వారి గురుదర్శనము (అవధూతలీల ముందుమాట నుండి)

"నేను శ్రీ భరద్వాజ మాష్టరు గారిని హమేషా దర్శించేవాడను. కానీ వారు చెప్పినట్లు శ్రీ వెంకయ్యస్వామి వారిని మాత్రం దర్శించేదిలేదు. నాయందు ప్రేమతో ఒక సంవత్సరం అలా చెప్పి చెప్పి చివరకు "శ్రీ స్వామివారిని దర్శించకుంటే నా దగ్గరకు రావద్దన్నారు". నా ముఖం వివర్ణమైంది. అది గుర్తించిన ఆ ప్రేమమూర్తి "శ్రీ స్వామివారు భూమి మీద దేవుడు, వెళ్ళి పరీక్షించుకో" అన్నారు. పరీక్షా విధానం కూడా వారే చెప్పారు.

1. ఎవరి నుండి ఏమీ గ్రహించని శ్రీ స్వామివారు నన్నడిగి తినేందుకు పెట్టించుకోవాలని,
2. ఎవ్వరినీ తాకనివ్వని శ్రీ స్వామివారు నాచేత తన కాళ్ళకు నూనె పూయించుకోవాలని కోరుకోమన్నారు.

నేను, నా స్నేహితుడు శ్రీ టి.వి.శేషగిరిరావు గారు వెళ్ళి శ్రీ స్వామివారి సన్నిధిలో కూర్చున్నాము. క్రొత్తవారు శ్రీ స్వామివారి పాదాలు తాకకుండా కాపలా ఉండే రోశిరెడ్డిగారు, గురవయ్యగారు ఎటో వెళ్ళారు. వెంటనే "తినేందుకు ఏమైనా పెడతాయ్యా" అని శ్రీ స్వామివారు చేయి చాపారు. మేము తీసుకెళ్ళిన శెనగలు, బెల్లం పొడిచేసి తెచ్చేలోగా రోశిరెడ్డిగారు, గురవయ్యగారు వచ్చి ఆ పొడి వారు పెట్టబోతే అంగీకరించక నాచేత పెట్టించుకొని తిన్నారు. అదేవిధంగా కాళ్ళకే కాకుండా శరీరమంతా నూనె నాచేత మర్ధించుకున్నారు. స్నానం కూడా నేనే చేయించాను. అది మొదలు శ్రీ స్వామివారి ఎడల భక్తి కుదిరింది.

శ్రీ సాయి సకల సాధుస్వరూపి గనుక గురుపూర్ణిమనాడు మేము చేయబోయే శ్రీ సాయి నామయజ్ఞానికి శ్రీ స్వామివారు రావాలని శ్రీ సాయినాధునకు విన్నవించుకున్నాము.ఎన్నోమార్లు ఆహ్వానించినా "ఇప్పుడు కాద"న్న శ్రీ స్వామివారు ఆనాడు మా ప్రార్ధన మన్నించి మా గృహానికి విచ్చేయడమే కాకుండా శ్రీ శేషగిరిరావుగారింట్లో జరిగే నామయజ్ఞాన్ని ఆశీర్వదించి వచ్చారు.

నేను శ్రీ సాయి చరిత్ర పారాయణ చేస్తుంటే ఒకరోజు శ్రీ స్వామివారు నా స్వప్నంలో 'చమురు లేకుండా కాల్చు'అని ఆజ్ఞాపించారు. తెల్లవారి శ్రీ స్వామివారి నడిగితే మౌనం వహించారు. కానీ చమురు పదార్ధాలు తిన్నపుడు నాకున్న ఆయాసం జబ్బు హెచ్చడంతో శ్రీ స్వామివారి సందేశం నాకప్పుడు అర్ధమైంది.

1980 సం||లో నేను కొన్నాళ్ళు శ్రీ స్వామివారి సన్నిధిలో ఉండి సేవిస్తానంటే "నీ అన్నంనీవు తింటూఉండ" మన్నారు. అట్లా ఎందుకు స్వామీ అంటే "వాళ్ళు బాపనోళ్ళు తినకూడదు" అని శెలవిచ్చారు. కాలాంతరంలో ఆమాట అక్షరాలా నిజమై ఇంట్లో తప్ప మరెక్కడ భోంచేసినా అనారోగ్య మవడంతో ఆ నియమాన్నే పాటిస్తున్నాను.

1983 సం||లో ఒక స్నేహితుని బలవంతంపై పై నియమాన్ని ఉల్లంఘించడంతో చలి, దగ్గు, ఆయాసం మొదలైనది. సుమారు నెలరోజులు ఆయుర్వేదం, హోమియో, అల్లోపతి వైద్యాలు విఫలమైనాయి. డాక్టరు గారి సలహాపై మద్రాసు వెళ్లదలచాను. ముందుగా శ్రీ స్వామివారి సమాధి దర్శించి మూడు నిద్రలు చేసి వెళ్ళాలని కలిచేడులో బస్సు ఎక్కినది మొదలు నా బాధలన్నీ

మటుమాయమైనాయి. శ్రీస్వామివారి సమాధి చెంత మూడు నిద్రలు చేసి ఇంటికి ప్రయాణమైతే తిరిగి నా బాధలు మొదలైనాయి. పూజారి నాగయ్యగారి సలహాపై పగలంతా ఉద్యోగం చేసుకొని సాయంకాలానికి శ్రీ స్వామివారిని దర్శిస్తానని చెప్పుకోగానే నాబాధంతా నివారణ అయింది. అది మొదలు నిత్యం సుమారు 60 కి.మీ. వెళ్ళి ఉద్యోగం చేసి తిరిగి గొలగమూడి చేరుతున్నాను. 1989 సం|| నవంబరు నెల నుండి శ్రీ స్వామివారి ఆజ్ఞ ప్రకారం వాలంటరీరిటైర్మెంటుఇచ్చి గొలగమూడిలో కాపురం ఉంటున్నాను. **బాధగూడ అనుగ్రహానికి గుర్తు** అని ఈ ఘటన వల్ల తెలుస్తుంది.

శ్రీ స్వామివారి సన్నిధిలో కూర్చున్నంత మాత్రాన నా ఆయాసం జబ్బు పోసాగింది. నిత్యం దోవ పొడవునా నామజపం చేస్తూ నాలుగు ఇడ్లీలు తెచ్చి శ్రీ స్వామివారికి కృతజ్ఞతతో సమర్పిస్తే తినేవారు. ఒకరోజు నా జేబులో పదిపైసలే ఉంది. పదిపైసలతో ఒకే ఇడ్లీ తేవడమా, అప్పుచేసి నాలుగు తేవడమా అనే ఆలోచనలతో మార్గమంతా నామజపం చేయలేకపోయాను. ఇడ్లీ తెచ్చాక శ్రీ స్వామివారు కనీసం తాకను గూడా లేదు.

మరొక రోజు శ్రీ స్వామివారి బృందమంతటికీ ఇంట్లో చేయించి ఇడ్లీ తెస్తానని చెప్పి-పప్పు నీటిలో పోసింది మొదలు తెల్లవారి ఇడ్లీ చేసినంతసేపు ఏమారకుండా నామజపం చేసి ఇడ్లీ తెచ్చేలోగా శ్రీ స్వామివారు హోటల్ నుండి తెచ్చిన ఇడ్లీ తినేశారు. ఆ విషయం తెలిసి చాలా బాధపడుతూ కూర్చున్నాను. నరసారెడ్డి భార్య నా చింతకు కారణం తెలుసుకొని నాలుగు ఇడ్లీలు ప్లేటులో పెట్టుకొని శ్రీ స్వామివారిని సమీపించింది. శ్రీ స్వామివారు ఆ నాలుగు ఇడ్లీలు తినేశారు. నాకెంతో సంతోషమైంది. కనుక మొదటి సన్నివేశములో ఇడ్లీలు తాకుటకు కూడా నిరాకరించుటకు, రెండవసన్నివేశములో ఇడ్లీలు స్వీకరించుటకుకారణము నామజపమే. కనుక **అందరూ శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన నామజపం చేసి తరించాలని నా ప్రార్థన.** “

## స్వామి సేవలో సార్

కాలాంతరంలో సార్ స్వామి సేవకు ప్రాధాన్యత ఇవ్వటంతో వారి పిల్లల బాధ్యత స్వామి ఎలా వహించినది, శరణాగతి చేయించుకున్నది, మన భావం ఎలా ఉండ వలసినది సార్ మాటలలోనే దమ్మపేట లక్ష్మక్కకు వ్రాసిన ఈ letter లో చూడవచ్చు.

అమ్మా! మనం ఏదైనా చెయ్యాలన్నా చేయలేము. చేయలేకుండా ఉండాలన్నా ఉండలేము. ఉదాహరణకు నా కుమార్తె అప్పుడు రైల్వేలో షోలాపూర్ ప్రక్కన హుటిగీ అనే స్టేషన్లో పార్మసిస్టుగా పనిచేస్తుంది. అప్పుడే స్టేట్ బ్యాంకులో ఉద్యోగానికి ట్రైనింగ్ కి రమ్మని ఆర్డర్ వచ్చింది. రైల్వే పెద్దసంస్థ అని, స్టేట్ బ్యాంకు చిన్న సంస్థ అని స్టేట్ బ్యాంకులో చేర్చేందుకు నాకిష్టములేక ఆ ఆర్డరు కాగితం పంపలేదు. భగవంతుని నిర్ణయం ఆమెను బ్యాంక్ లో ఉద్యోగం చేయించాలని, గనుక ఆమె పనిచేసే గ్రామంలో ఆ ముందటి రోజు డాక్టరును చంపే ప్రయత్నం చేశారు. ఆ రోజు డాక్టరు లేకుండా ఉంటే మాఅమ్మాయికి ఆ మర్యాద జరిగి ఉండేదే. అందుకని తెల్లవారి సామాను సర్దుకొని ఇంటికి రాబోతుంది. అదే సమయంలో నేను షిరిడీ పోవాలనే ప్రేరణ పెట్టి బ్యాంక్ ఆర్డర్ ఊరక తీసుకపొయ్యాను. షిరిడీ ప్రయాణము మానుకుని తెల్లవారి 10 గంటలకు తిరుపతి ట్రైనింగ్లో చేర్చాలి. వెంటనే హుటిగీ నుండి తిరుపతి వచ్చి ట్రైనింగ్లో చేర్చాను. నా షిరిడి ప్రయాణము పోయింది.

నేను అనుకున్న శిరిడియాత్ర సాగలేదు. భగవంతుని నిర్ణయానుసారం ఆమె స్టేట్ బ్యాంకులో ఉద్యోగి అయింది. బ్యాంకు ఉద్యోగినే వివాహమాడి నెల్లూరులో ఇల్లు కట్టుకుని కాపురం ఉన్నారు.

మనం ఒకపని చేసేందుకు చేయకుండా ఉండేందుకు స్వేచ్ఛ లేని వారము. భగవంతుని చేతిలో ఉపకరణాలు మాత్రమే. ఇది తెలిసి దేనికి చింత చేయకుండా హాయిగా నీ ఇష్టం వచ్చినట్లు నడువు.

-పె.సు.

---

శ్రీ సార్ వెంకయ్య స్వామి వారి ఆదేశం మేరకు రాత్రి గొలగమూడిలో నిద్ర చేస్తూ, కలిచేడు ఉద్యోగం కొరకు వెళ్లి వస్తూ సమాధి మందిరంలో తెల్లవారు జామున సేవ చేసుకుంటూ ఉండే రోజులవి. 1983-84 సం|| సమయం. శ్రీ సార్ నివాసం గొలగమూడిలో శ్రీ స్వామి వారి సమాధి వెనుక పూరి గుడిసెలో ఉండేది. అమ్మగారు సార్ పిల్లలు ఇంకా కలిచేడులోని ఇంట్లోనే ఉండేవారు. సార్ ఉదయమే 3 గం || కు కట్టెల పొయ్యి పెట్టి సమాధి మందిర అభిషేకానికి భక్తుల స్నానాలకు వేడి నీళ్ళు అందించేవారు. సార్ చన్నీటితో స్నానం చేసి ప్రదక్షిణలు చేసి పూజకు కావలసినవి సమకూర్చేవారు. తరువాత ఉదయం 6 గం || కు బయలుదేరి, 9 గం || కు స్కూల్ కు వెళ్లి సాయంత్రం 4 గం వరకు విద్యుక్త ధర్మం (పాఠాలు చెప్పటం) నిర్వర్తించి రాత్రి 7 గం కు గొలగమూడి తిరిగి వచ్చేవారు.

గొలగమూడిలోని అప్పటి స్వామి సేవకులలో లెక్కలు వ్రాయటం మొ || తెలిసిన వారు సార్ ఒక్కరే కావటం వల్ల, సార్ కు స్వామి సేవపై గల శ్రద్ధ వల్ల రాత్రి 8 గం || నుండి 12 గం || వరకు స్వామి భక్తులు పంపిన M.O. లను నోట్ చేసి, వారికి విబూది, స్వామి దారం, ప్రసాదాలు, రిప్లై ఇచ్చే సేవ చేస్తుండే వారు. స్వామి సమాధి మందిర ఖర్చులు, భక్తుల విరాళాల జమలు నమోదు చేయటం కూడా చేసే వారు.

## స్వామి మొదటిఆరాధన కి స్వామి చరిత్ర లీలలు “అవధూత లీల” గ్రంథం తయారవటం

శ్రీ భరద్వాజ మాస్టర్ శ్రీ వెంకయ్యస్వామి మీద గ్రంథం వ్రాస్తే ఆశ్రమం వాళ్ళు చదివి దాంట్లో వెంకయ్యస్వామి గురించి మాత్రమే ఉండాలి అంతేకానీ మిగిలిన మహనీయుల ప్రస్తావన తీసేసి వ్రాయమన్నారు. సార్ కి చాల బాధ కలిగి ఈ విషయం సార్ భరద్వాజ మాస్టర్ కి చెప్తే సార్ ని వ్రాయమన్నారు. సార్ “మీరు వ్రాస్తేనే బాగుంటుంది. నాకు వ్రాయటం చేతగాదు” అంటే భరద్వాజ మాస్టారు గారు వెంటనే “ఏమీ లేదు సుబ్బరామయ్య! లీలలు ముందుది వెనుక, వెనుకది ముందుకు వ్రాస్తే సరిపోతుంది” అని చెప్పారు. ఆరాధన సమయం దగ్గరబడుతోంది. ఎవరో చేత శ్రీ వెంకయ్యస్వామి గ్రంథం ఇష్టమొచ్చినట్లు వ్రాస్తారని సార్ కి బాధ. అందుకు మరలా శ్రీ స్వామి వారి గ్రంధాన్ని సరి చూడమని శ్రీ భరద్వాజ మాస్టారని సార్అర్థించారు. కానీ మాస్టర్ కి గల ఎన్నో సాయి సేవా కార్యాలు, విజిటర్స్ వల్ల అది సమకూడ లేదు. సార్

మాస్టారని "నేను రోజు వస్తాను, కొద్ది సమయం కేటాయించమని" అడిగితే మాస్టారు అలానే ఒప్పుకున్నారు. సార్ రోజు స్కూల్ తరువాత 9 గం || కు ఒంగోలు చేరేవారు. శ్రీ మాష్టారి వద్ద రాత్రి 10గం నుండి 12 గం వరకు ఎడిటింగ్ పని పూర్తి అయ్యాక రాత్రి సుమారు 1.30 గం కు నెల్లూరు చేరేవారు.అచ్చట నుండి సైకిలు ప్రయాణంతో అర్ధరాత్రి చిమ్మ చీకటిలో అడవి బాటన స్వామి వద్ద నిద్ర చేయాలనే తన నియమం అనుసరించి 2 గం || కు గొలగమూడి చేరేవారు. 2- 4 గం || నిద్ర తరువాత స్వామి సమాధి సేవ, మరలా ఉదయం 7 గంటలకు కలిచేడు స్కూల్ కి వెళ్ళటం - ఇలా 3 నెలలు అవిశ్రాంతంగా శ్రమించి మనకు అవధూత లీల గ్రంధాన్ని అందించారు. శ్రీ సార్ ఈ విశేష సేవకు శ్రీ స్వామికృపగా ఈ మూడు నెలల్లో ముండ్లతో నిండిన అడవి బాటలో సైకిల్ పైననే వెళ్లి వస్తున్నా ఒక్క రోజు కూడా సైకిల్ టైర్ పంచర్ కాలేదు. ప్రయాణం ఆపవలసిన ఆటంకం రాలేదు.

## గొలగమూడి నివాసం

శ్రీ సార్ గొలగమూడిలో నిద్ర చేయాలనే నియమాన్ని అనుసరించి రోజు కలిచేడులో స్కూల్ కాగానే బయలుదేరి గొలగమూడి వస్తుండటంతో అమ్మగారు ఒక సంవత్సరం అయ్యాక "పిల్లలుతన మాట వినట్లేదని, తను గొలగమూడిలోనే ఉండేందుకు సిద్ధమై" వచ్చేశారు. వారి అవసరార్థం ఒక చిన్న రేకుల ఇల్లు నిర్మించదలచి స్వామి చీటి సందేశం అనుసరించి స్వామి సమాధి మందిరం వెనుకనే ఒక చిన్న రేకుల ఇల్లు కట్టుకున్నారు (సున్నం పూత లేని మట్టి గోడలతో). ఆ ఇల్లే 1984-99 వరకు వివిధ ప్రాంతాల నుండి స్వామిని దర్శించ వచ్చే ఎందరో భక్తులకు "సామానులు, చెప్పులు భద్రపరిచే ఆవాసంగా" నిలయమైనది.

అమ్మగారు నీటికి, పొయ్యిలో కట్టెల సమకూర్చుకొనుటకు, మరెన్నో కనీస అవసరాలకు, ఎన్నో కష్టాలను చవి చూచారు. అప్పటివారి ఇంట్లో పాములు, తేళ్ళు యథేచ్ఛగా సంచరించేవి. మట్టి గోడలలోని చెదలు గుడ్డలను తినటం, కొంతమంది స్థానికులు స్వామి స్థలంలో ఉన్నారనేవారు. ఎన్ని ఇబ్బందులకైనా చలించలేదు. పైగా కలిచేడు లోని మిద్దె ఇల్లు అమ్మకుంటే ఎప్పటికి అయినా మరలా అచ్చటకు వెళ్ళాలి

అనిపిస్తుందని, స్వామి సన్నిధి వదులుకునే గతి పడుతుందని ఆ మిద్దె ఇల్లు అతి తక్కువ ధరకు అమ్మి వేసారు. ఈ విషయాన్ని అమ్మగారు ఏనాడూ పట్టించుకోలేదు.

## పుస్తక రచన – గ్రంధ ముద్రణ

మనలా పామరులలా పరిస్థితికి కాని, ఆరోగ్యానికి, నియమాలకు కాని భాదపడుతూ తన, పర విమర్శలతో కాలం వెళ్ళ బుచ్చలేదు. సార్ ఈ కాలంలో స్వామిపై మనస్సు లగ్నం చేయటానికి వీలుగా శ్రీ మాష్టారిరచనా శైలిని అనుసరించి స్వామి మాటల, లీలల, ఆచరణ ద్వారా చేసిన బోధను మననం చేసి పామర భాషలో విశదీకరించే"అవధూత భోధామృతము"ను, స్వామి సన్నిహిత సేవకుల ఆచరణను, జీవితాలను,ఉత్తమ సంస్కారాలను, సేవానిరతిని, స్వామి వారికి చేసిన మేలునుపరిశీలనాత్మక సంగ్రహంగా పొందు పరుస్తూ"స్వామి సన్నిధి"ని, స్వామి సమాధి అనంతరం భక్తుల అనుభవాలను 9 పైగా చిన్న పుస్తకాలుగాను రచించారు. స్వామి సమాధి అనంతరం కూడా శ్రీ సాయినాధుని వలె తన కార్యాన్ని నిర్వహిస్తున్నారని నిత్య సత్యులై పలుకుతున్నారన్న ఆ పుస్తకాలలోని నిదర్శనాలు ఎందరికో అందటం వల్లే మరెందరో స్వామి సన్నిధికి చేరి సద్వినియోగం చేసుకోగలిగారు.

అలానే శ్రీ భరద్వాజ మాష్టారితో తనకు గల ప్రతి అనుభవాన్ని, వారు గ్రహించిన ఆచరణాత్మక సందేశాలను కళ్ళకు కట్టినట్లు వివరిస్తూ "నాకు తెలిసిన మాస్టారు", "మాష్టారి మంచి మాట" (తరువాతి కాలంలో ఈ రెండు కలిపి "మాస్టారి భోదామృతం" గా) అందించారు. అంతేగాక శ్రీ భరద్వాజ మాష్టారి దివ్య లీలలను (సమాధికి ముందు, తరువాత) పొందుపరుస్తూ "మృత్యువుపై ఘన విజయం", "అమృత వాక్కులు", "శుద్ధ చైతన్యమే తానైన శ్రీ భరద్వాజ మాస్టారు గారు", "భరద్వాజ మాష్టరుతో భక్తుల అనుభవాలు" అనే అద్భుత గ్రంధాలను రచించారు. శ్రీ భరద్వాజ మాష్టారికి వారి గురువు గారైన శ్రీ సాయిబాబా ఇచ్చిన "pen is a mighty investment" సందేశం, శ్రీ భరద్వాజ మాస్టర్ ఎందరో మహనీయుల చరిత్రలను వ్రాసి చూపెట్టిన జీవిత విధానాన్ని ఆదర్శంగా సార్ తీసుకున్నారు. ఆ స్ఫూర్తితో ఎందరో

మహనీయుల భక్తుల అనుభవాలను, జీవిత విశేషాలను కూరుస్తూ గ్రంధాలు వ్రాసి ముద్రించారు.

మాష్టారి గారు అందరికీ ఎక్కువగా చెప్పి ప్రోత్సహించి చదివించిన వార్తాలాపం గ్రంధ ముద్రణ సార్ యొక్క నిరంతర కృషికి కలికితురాయి. వార్తాలాపం తెలుగు గ్రంథం ఎక్కడో బెంగుళూరులో (కాగితం చినిగిపోయే స్థితిలో) ఒక్క పాత కాపీ ఉంటే విద్యానగర్ లో ప్రొఫెసర్ గా పనిచేస్తున్న శ్రీ రవికుమార్ గారి చేత ప్రయత్నం చేయించి ఎంతో జాగ్రత్తగా ముద్రించారు.

శ్రీ రంగన్న బాబు గారి చరిత్ర, శ్రీ దర్గాస్వామి చరిత్ర, శ్రీ మాధవదాసు గారి చరిత్ర, శ్రీ పూండీ స్వామి చరిత్ర, శ్రీ యర్ర దర్గాస్వామి చరిత్ర, శ్రీ నరోపా గారి చరిత్ర, శ్రీ మాయి అమ్మ, శ్రీ కృష్ణయ్య స్వామి చరిత్ర, శ్రీ నాంపల్లి బాబా గారి చరిత్రలు ప్రతి ఒక్కటి అమృత భాండాగారాలు. ఈ గ్రంధ యజ్ఞాన్ని తామొక్కరే చేయటం కాకుండా తమనాశ్రించిన భక్తుల చేత కూడా చేయించి వారికి జీవితం సాఫల్యం చేసుకునే మార్గాన్ని చెప్పకనే చెప్పి ఉద్ధరించారు.శ్రీ వెంకయ్యస్వామి సార్ కి ఇచ్చిన అనుభవాలను స్మరిస్తూ “గురుస్తుతి”ని, స్వామిని చూసి ఏమి నేర్చుకోవాలో చెపుతూ “చూచి నేర్చుకో” అనే గ్రంధాలు రచించారు.

## సాధన – నియమ పాలన

శ్రీ స్వామి ఆదేశంతో 1989 లో వాలంటరీరిటైర్‌మెంట్ తీసుకున్ననుండి పూర్తిగా స్వామి సేవకు అంకితమై ఉదయం 3 గం కు అభిషేకం, ఉదయం, మధ్యాహ్నం (అవసరమైతే సాయంత్రం కూడా) స్వామికి పూజ సమాధి మందిర సేవ చేస్తూ, ఈ పుస్తక రచన, భక్తులతో తన అనుభవాలను పంచుకోవటం ఇలా నిరంతర స్వామి చింతన తో గడుపు రోజులవి.

శ్రీ సార్ నియమ పాలన, అందులో లోటు పాటులను స్వామిపై ఆధార పడి సరిదిద్దుకునే ఆచరణ చిత్రంగా ఉండేది. ఆ రోజుల్లో ఉ 2 గం – 8 గం వరకు స్వామి సమాధి మందిరంలో ఉండేవారు.

- ఒక రోజు ఆకలి అనిపించి స్వామి ప్రసాదం పొంగలి కొంచెం (చిటికెడు) నోట్లో వేసుకున్నారు. దానిలో ఉప్పు, కారం, నూనె ఉండటంతో అది స్వామి ఆదేశించిన నియమానికి విరుద్ధం కావటంతొ సార్ మనః పరిస్థితి బాగా డీలా పడి స్వామి సేవగా తను చేసే ఎన్నో కార్యాలు చేయలేక పోయారు. అన్ని పనులు రేపు రేపు అని ఆలస్యం చేస్తూ దానికి కారణం నియమ ఉల్లంఘన అని గుర్తించి నిరాహారిగా, అనాథగా 24 గం స్వామి సన్నిధి ఎదురుగా ఎవ్వరితో మాట్లాడకుండా ప్రార్థనతో గడిపే శిక్ష విధించు కొన్నారు. ఆ గడువు అనంతరం రెట్టించిన ఉత్సాహంతో పూర్వ మనఃస్థితితో స్వామి సేవలో నిమగ్నమవగలిగారు.
- అలానే మరో సారి లేత బీన్సు కాయలు బాగున్నాయని ఎక్కువ తిని ఆయాసం వస్తే మాష్టారి సందేశంతో "చాపల్యాలు నశించనిదే వేయి జన్మలు ఎత్తిన ఇంతే" అని గుర్తించి 15 రోజులు 3 పుటల లోటాడు బొంబాయి రవ్వ జావతొ జీవించారు. మధ్యలో ఒకరోజు స్వామి సమాధికి హారతి ఇస్తూ నీరసం వల్ల పడిపోయారు. అట్టి పరిస్థితిలో కూడా తాము పెట్టుకున్న నియమం తప్పలేదు.

స్వామిపైఎలాంటి విశ్వాసం, ఎట్టి అవగాహన ఇట్టి నియమ పాలనను సాధ్యం చేసిందో ఈ క్రింది సార్ letter లో సార్ మాటల్లోనే కొద్దిగా చూడవచ్చు.

గొలగమూడి

20-05-2005

Dear Sai !

శ్రీస్వామివారు ప్రేమించిన శిష్యులు - పోలిరెడ్డి, జాతకాల రామానాయుడు, రోశిరెడ్డి, వక్కమ్మ, తులసమ్మ వీళ్ళందరిని ఎందుకు ఎక్కువగా ప్రేమించారు? వారి యొక్క కఠోర నియమపాలన, రెండవది శ్రీస్వామివారి ఆజ్ఞను ఎంత కష్టమైనా ఆచరించడం. నేను వారి ఆజ్ఞలను కఠోర నియమపాలనగా పాటించలేదని సామ దాన భేద దండోపాయాలు నాపైన ప్రయోగించారు. మొదట చిన్న తప్పయినా తప్పేనని చెప్పారు. ఆ తర్వాత స్వప్నాల ద్వారా బెదిరించారు. అప్పటికీ వినకుంటే విపరీతంగా

ఆయాసం పెట్టారు. అంతేగాక నాతప్పేమిటని అడిగితే నీకు కఠోరనియమపాలన లేదని చెప్పారు. ఆ తర్వాత మరలా చాపల్యములు నశించనదే వెయ్యి సంవత్సరాలు తపస్సు చేసినా ఉన్న చోటనే ఉంటావని చెప్పారు. అది వారి అనంత కరుణకు నిదర్శనం. జిహ్వాకు లొంగితే ఏ పని చేయాలనే బుద్ధి పుట్టదు. మనస్సు చేయమన్న పని మీద ఉండక అన్యచింతలకు లోనవుతుంది.

---

అలాంటి అవగాహనతో కూడిన గుర్తింపు వల్లనే కాలు విరగటం వంటి ఎన్ని కష్టతరమైన అవాంతరాలు వచ్చినా కఠోర నియమ పాలన వీడక చివరి శ్వాస వరకు స్వామి సన్నిధి సేవలో స్వామికి ప్రీతి పాత్రులైన శిష్యునిగా గడుపుతూ, స్వామిని తను ఆశ్రయించిన ఎందరికో ఎలా ఆశ్రయమయ్యారో, మార్గదర్శక మయ్యారో మనం సార్ జీవితంలో చూడవచ్చు.

సార్ కి ఒకసారి బ్రహ్మం గారి మఠం కడుతున్నప్పుడు ప్లాస్టరింగ్ చేయటానికి కట్టిన చవకల మీద నుండి సార్ క్రింద పడి చెయ్యి విరిగి బాగా వాచి పోయింది. అమ్మగారు నెల్లూరులో వాళ్ళ అమ్మాయి, అల్లుడికి చెప్తే వాళ్ళు అంబులెన్సు తీసుకొచ్చి నెల్లూరికి వెళదామని సార్ ని బాగా ఒత్తిడి చేసారు. సార్ చివరకి వారితో "నేను స్వామి చెప్పిన నియమం ప్రకారం గొలగమూడిలోనే ఉంటాను కానీ నెల్లూరు రాను, స్వామే చేయి విరగగొట్టాడు కాబట్టి ఆయనే చేయి ఇవ్వాలి. అయన నేను ఇలాగే ఉండాలనుకుంటే ఇలాగే వుంటాను తప్ప గొలగమూడి దాటి రాను" అని తేల్చి చెప్పారు. అలానే మొండిగా ఏ మందు వేసుకోకుండా వున్నారు. స్వామి కృప వలన చెయ్యి దానంతట అదే బాగైపోయింది.

2007 లో సార్ కి కుడి మోకాలు విరిగింది. చాలా చిత్రంగా ఒక గూడూరులో నివాసమున్న ఒక పుత్తూరు డాక్టర్ ని తీసుకొస్తే సార్ కి కట్టు కట్టి సార్ తో 'నాకు పిల్లలు పుడితే శ్రీ వెంకయ్య స్వామి దగ్గరకి వస్తానని మ్రొక్కుకున్నాను, ఎన్నో సంవత్సరాలై పోయింది. ఇప్పటికి గానీ రాలేకపోయాను. మీకు నయం అయ్యే దాకా ఇక్కడికి వచ్చి వైద్యం చేస్తాను' అని చెప్పి అలానే చేసాడు. సార్ కి మూడు నెలల పాటు ప్రక్క మీదే అన్ని జరిగేవి. అలాంటి సమయంలో కూడా భక్తులకి ఎన్నో

అనుభవాలు ఆయన సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు అని ఇస్తున్నారు. క్రింద ప్రస్తావించినవి మచ్చుకి ఒకటి.

సురేష్(అల్లంపాడు)కి తన ఇంట్లో తలుపు దగ్గర సార్ ప్రత్యక్షమై "అన్నం తినకపోతే చస్తావు, తిను!" అని గదమాయించారు. అప్పటికే సార్ కి కాలు విరిగి గత రెండు నెలల నుండి మంచం మీదే వున్నారు. ఆ వారంలో శనివారం గొలగమూడి వెళ్ళిన సురేష్ ను "అన్నం తిన్నావా?" అని మొదటి ప్రశ్న వేసి అంతకు ముందు వాళ్ళింట్లో కనపడినది నిజమేనని దృఢపరిచారు.

1999-2000 నాటికి "సాయిమాస్టర్ నిలయం", ప్రక్కన వారికి ఒక మిద్దె ఇల్లు నిర్మాణం పూర్తయి 2000 నుండి ఆఇంట్లో నివాసం సాగించారు. ఒక్క అంకణంలో చిన్న ఇల్లు నిర్మించుకోదలచుకున్న సార్ చే పెద్ద ఇల్లు, భక్తులకు వసతికై "సాయి మాస్టర్ నిలయం" నిర్మింప చేయటం లో స్వామి కృప ఎలా ఉందో సార్ మాటల్లో ఈ క్రింది letter లో చూడవచ్చు. పూర్తి వివరణ సార్ వ్రాసిన "గురు స్తుతి" పుస్తకంలో చూడవచ్చు.

Dear Sai !

శ్రీస్వామివారు ఎంతటి కరుణామయలో ఈ మాయగప్పిన మనసు ఊహించలేదు. శ్రీసాయిమాస్టర్ నిలయం ఉండే తావులో ఇల్లు కట్టాలని శంకుస్థాపన గుంట త్రవ్వుతుంటే ఆరుఅడుగులు త్రవ్వినా అంతా loose soil లే. నీరు విపరీతంగా ఊరుతుంటే మానేశాను.

అంకణం 500 రూపాయలకు కొని వెయ్యిరూపాయలకైతే ఇస్తానన్న విజయభాస్కర్ అంకణము 500 రూపాయలకు ఇస్తానని లెటర్ వ్రాస్తే అది కచ్చితంగా శంకుస్థాపన ముహూర్తం టైములోనే చేరడం శ్రీస్వామివారి దివ్యలీలే. ఆ స్థలం కొని ఇప్పుడు కాపురం ఉంటున్న ఇల్లు ఉండేచోట రెండు అంకణముల రూము వేయించాలని వాస్తు అతనిని పిలిస్తే వచ్చి ఇంటికి మొత్తం ప్లాను ఇస్తాను. నీ శక్తి ఉన్నంతవరకు కట్టుకో అని ప్లాను గీసి ఇచ్చాడు. మా మామ వచ్చి మొత్తం ప్లాను ప్రకారం పునాదులు కట్టు మిగిలిన రెండు అంకణముల రూమే వేసుకో డబ్బు చాలకుంటే వడ్డీలేకుండా నేనే

ఇస్తానని బలవంతం చేశాడు. సరేనని ప్లాను ప్రకారం సున్నం పోసి పునాది తవ్వాలని ప్రయత్నిస్తే ప్లానంతా ఒకే బండ మూడు అంగుళములు కూడా తెగలేదు. ఆ మార్గాన వెళ్లే బేలుదారు వచ్చి ఈబండను పగలగొట్టవద్దు. Plinth beam వేసి ఇల్లు కట్టు నాది జవాబు అని ప్రోత్సహించాడు. మామూలుగా బిల్డింగ్ అంతా ఒక లక్ష రూపాయలు అయితే అందులో ఫౌండేషన్ కట్టే ఖర్చు రూ 25,000 ఉంటుంది. ఇప్పుడు నాకు రూ 25,000 మిగిల్చారు. బేలుదారికి కూలి ఇచ్చే పని లేకుండా పరంధామయ్య చేత చీటీలు పెట్టించి సుబ్బరామయ్యగారికి పనిచేయమని చెప్పారు. అతను కట్టబెట్టి అన్నం తిన్నాడే కానీ ఒక్క పైసా తీసుకోలేదు. కనుక కనీసం ఐదువేల నుండి 10000 మిగిలాయి. విజయభాస్కర్ ను ప్రేరేపించి లెటర్ వ్రాయడము, మామామను ఇంటి ప్లానంతా పునాదులు కట్టమని, డబ్బు నేను ఇస్తానని చెప్పించి పునాదులు కట్టాలని ప్రయత్నిస్తే బండవల్ల పునాదులు కట్టేపని లేకుండా చేశారు. పరంధామయ్యను బేలుదారుగా తీసుకువచ్చి ఆ ఖర్చు తప్పించాడు. U.T.I లో మెచ్యూర్ అయి డబ్బు రావడంతో బిల్డింగ్ అంతా ప్రహరీలు సహా బావితో సహా తయారు చేయించిన మహనీయుడు. మనకు ఆయా సమయాలలో మనసు కష్టంగానే ఉంటుంది కానీ అది మన మంచికే. లక్ష్మక్క కు నమస్కారములు.

పెసల సుబ్బరామయ్య

గొలగమూడి, 22-**7-2005**

Dear Sai **!**

నిన్నటి లెటర్లో శ్రీ స్వామివారు నా ఇల్లు కట్టించిన విషయం వ్రాశాను. అప్పుడు నేను యమతిండి తింటూ ఇద్దరు మనుషుల పని చేస్తున్నాను. కామాంధుడినై కన్ను కానని రోజులవి. ఒక్కసారైనానా ఇల్లు కట్టే పనిలో సహాయము చేయమని నేనుస్వామిని ప్రార్థించి ఎరగను.అంతా చేయవలసింది మనమే కదా.అంతా చేయ వలసింది మనమే గదా,వారేమి చేస్తారనేఅహంకారము తలకెక్కిన రోజులు అవి.

ఎసరు పెట్టి మనం మంట చేస్తే వంట అవుతుందనే వెధవ వేదాంతం. బియ్యపుగింజ తయారుచేయటం మనకు చేతకాదనే విషయమే స్ఫురించని కామాందపు రోజులవి. శ్రీ సాయి మాస్టర్ నిలయం ఉండేచోట శంకుస్థాపన గుంట కొంత త్రవ్వి పూడిపించారు. నా ప్రార్థన లేకనే వాస్తు ప్లాన్ గీసి ఇచ్చారు. నా ప్రార్థన లేకనే మా మామ పునాదులకు డబ్బు ఇస్తాను అని బలవంతం చేసాడు.నా ప్రార్థన లేకనే పరంధామయ్య బేలుదారిగా వచ్చాడు. నా ప్రార్థన లేకనే బిల్డింగ్ అంతా ఒకే ఒక బండ పడి పునాదులు కట్టే పని ఖర్చు లేకుండా పోయింది. మన ప్రార్థన లేకుండానే సర్వం జరిగిపోతుంది. అది ఆ సద్గురుమూర్తి కృప. ఇంత జరిగినా ఇలాంటివి ఒకటి రెండు కాదు వందల అనుభవాలు జరిగినా ఈ మలిన మనసు నేటికైనా కుదురుగా ఉండమన్న చోట ఉంటుందా. అటు భవిష్యత్తులో లేక గతాన్నో యోచిస్తోంది. ఏమో దీన్ని ఆ సద్గురుమూర్తి ఎప్పుడు హతమార్చి కూర్చోబెడతాడో తెలియదు. తప్పక కూర్చో పెడతాడు. ఈలోగా ఇంద్రియలోలత్వం, ఆశ. సోమరితనం, జిహ్వాచాపల్యం పరదూషణ, స్త్రీలోలత్వం అను నాలోని దొంగలను కనిపెట్టి తరిమే ప్రయత్నం చేయాలి. సిన్సియర్ ప్రయత్నం చేయాలి. శ్రద్ధ కాదు కేవల శ్రద్ధ అవసరమంటారు శ్రీ మాస్టారు గారు. శక్తినంతా వినియోగించి కృషి చేయమంటారు సాయి. లేకుంటే మానవజన్మ పిడకలు ఏరుకునేందుకునంటారు. అలాంటి దౌర్భాగ్యస్థితి కాకుండా వారిచ్చిన పనిచేసే ప్రయత్నం సిన్సియర్ గా చేసి తరిద్దాం. అక్క గారికి నమస్కారములు.

---

## సాయి మాస్టర్ నిలయం - సాయి మాస్టర్ సేవా ట్రస్ట్

సాయి మాస్టర్ నిర్మాణం అయిన నుండి రోజు 4 వేళలా ఆరతులు, రెండు పూటలా సత్సంగం మరింతగా భక్తులకు స్వామిని సేవించుకొనుటకు ఆశ్రయం లభించింది. సార్ సన్నిధి లోనూ, సత్సంగం లోనూ కలిగే ఆనందం అనుభవించాలే

కానీ వివరించలేనంతగా ఉండేది. శ్రీ సార్ ఈ కాలంలో 2002 లో "శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్" ను స్థాపించారు. ఆ తరువాత ఈ ట్రస్ట్ ద్వారా మరిన్ని పుస్తక ప్రచురణ, ఎంతగానో, ఎందరికో (లక్షకు పైగా) ఉచిత కాపీలుగా స్వామి చిన్న పుస్తకాలను అందించడం చేసారు. అలానే ముద్రితమైనప్రతి కొత్త పుస్తకము ఎన్నో ఊర్లలోని సత్సంగాలకు సార్ ప్యాక్ చేసి బుక్ పోస్ట్ ద్వారా ఉచితంగా పంపేవారు. పుస్తకాలన్నీ ఏమాత్రం లాభం లేకుండా ముద్రిత ధరకే భక్తులకు అందించే వారు.

అలానే సాయి మాస్టర్ నిలయంలో స్వామి కృప వల్ల నయం చేసుకోవాలని అలవి గాని వ్యాధులతో ఇబ్బందులతో వచ్చే ఎందరికో కొన్ని నెలల పైగా ఆశ్రయము, చక్కటి మార్గ దర్శకము ఇచ్చేవారు. మచ్చుకు ఒకటి, రెండు.

- మిలటరీ లో రిటైర్ అయిన ఒక పెద్ద ఆఫీసర్ స్వామిని ఆశ్రయించ వస్తే గొలగమూడిలో స్వామి సన్నిధి విశేషం తెలిపి కష్టాలకు ఓర్వలేక గొలగమూడిలో సరైన ఇల్లు దొరకక వెళ్ళబోతే సాయి మాస్టర్ నిలయంలో ఆశ్రయం ఇచ్చి చివరి వరకు స్వామి సన్నిధిలోనే ఉండేలా స్వామికృపకు పూర్ణంగా పాత్రులై అనాయాసంగా ధ్యానం చేసుకుంటూ మరణించి సద్గతి పొందేలా సహకరించారు.
- సాయి లక్ష్మి అని ఒక ఆమె శరీరమంతా పుండ్లు వచ్చి, మచ్చలు వచ్చి ఎక్కడా నయం కాక స్వామి సన్నిధికి వచ్చి సాయి మాస్టర్ నిలయంలో ఆశ్రయం అడిగితె ఆమెకు స్వామిపై ఆధార పడే మార్గం చెప్పి నయం అయ్యేలా చేసారు. మరలా సార్ మాట వినక ఆస్తి పంపకాలని ఇంటికి స్వామి ఆదేశం కాకనే వెళ్లి మరల రోగం రాక మునుపే హెచ్చరించారు. పరిస్థితుల ప్రభావంచే మరల రోగగ్రస్తురాలైతే స్వామిపై ఆధార పడే అవకాశం కల్పించటం మాత్రమే కాక విశ్వాసంతో ఉన్న కారణంగా ఆమెకు సేవలు కూడా చేసారు, చేయించారు.
- అలానే వారి స్నేహితుడైన రాజ గోపాల్ మాస్టారికి గొలగమూడిలో ఇల్లు దగ్గర ఉండి కట్టించారు. ఆయనకు పక్షవాతం వస్తే రోజూ వారింటికి వెళ్లి స్వామి లీలలు చెప్పి, నామం వ్రాయించేవారు. దానితో ఆయనకు పక్షవాతం తగ్గింది. సత్సంగం కూడా ప్రసాదించారు.

- ఒక పక్షవాతం వచ్చిన పిల్లాడి కుటుంబానికి ఆశ్రయము ఇచ్చి స్వామి కృప వల్ల నయం అయ్యే మార్గం సూచించారు.

సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ ను స్వామి ఎలా నడిపిస్తున్నారో వారి పట్ల మనకు ఉండవలసిన భావం సార్ మాటల్లో :

గొలగమూడి,

05-06-2005

Dear Sai!

శ్రీ స్వామివారి దయ వలన నీ చదువు బాగా సాగాలని ప్రార్థిస్తున్నాను. మీ ఎరుక లేకుండా మీ రిజల్యూషన్ లేకుండానే మరలా లక్ష రూపాయలు నెలసరి వడ్డీ ఇచ్చేటట్లు శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ పేరుతో వేశాను. ప్రతి నెలా వచ్చే వడ్డీ మదర్ తెరిసా అనాధాశ్రమానికి ఇవ్వాలనుకున్నాను. రేపు మీరు వచ్చినప్పుడు ఫిక్సిడ్ డిపాజిట్ వేసే ఫారాల మీద అమ్మ సంతకాలు పెట్టాలి.

చూచావా సాయి మరో అనాధాశ్రమం కట్టాలంటే అది వీలు కాకుండా మదర్ తెరెసా ఆశ్రమాన్ని అనాధాశ్రమం గా చేశారు. ప్రతిదీ ఇలాగే ఉంటుంది. మన ఇష్టాఇష్టాలు లేకుండా వారు నడిపించినట్లే నడవగలుగుతాము. అయితే ఆ బాట కష్టంగా ఉంటుంది. ఎందుకని? మనకు ఇష్టాఇష్టాలు పోలేదు కనుక. వాటిని ఆ మహనీయుడు వదల కొట్టినంత వరకు విశ్రాంతి లేకుండా వెంటపడుతూ మనలను నడిపిస్తుంటారు. కనుక ఇష్టాయిష్టాలు వదలి వారు నడిపించినట్లు ఆడుతుంటే వారికీ శ్రమ ఉండదు మనకు కష్టం ఉండదు. అదే అన్నమయ్య పాడిన పాట. ఓ దేవాదిదేవా మా ఆటపాటలతో మిమ్ము మెప్పించవల్లనేగా మోక్షమని మిమ్మడగ తగదు. అంటే అర్థం ఇప్పుడు శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్టు నడిచే తీరు అదే.

------------------------------------------------------------------.

గొలగమూడి

04-07-2005

పూజ్య గురు బంధువుకు నమస్కారములు. శ్రీ స్వామివారు మనలోని బలహీనతలు బయటకు రప్పించేందుకు ఎలాంటి పరిస్థితులు ఏర్పరుస్తారో చూడండి. ఆ బలహీనత బయటపడందే మనకు అలాంటి బలహీనత ఉందని మనకు తెలియదు. దానిని పోగొట్టుకునే తీవ్రప్రయత్నాలు చేయము. శ్రీ సాయి మాస్టర్ నిలయము కట్టించి నాలోని ఎన్నో బలహీనతలు తొలగిస్తున్నారు చూడండి. మొన్న ఒక 20 సంవత్సరాల 20MBBS చదివే అమ్మాయి దీక్ష చేయాలంటే ఉండమన్నాను. ఆమె ప్రవర్తన నచ్చక ఖాళీ చేయమన్నాను. తప్పు చెప్పమన్నది. చెప్పాను. ప్రమాణాలు చేస్తానన్నది. మాటకు మాట అరిచేసాను.

అసలు అరవడం ఎందుకు? మెల్లగా తప్పు చెప్పకుండానే ఖాళీ చెయ్ అంతే, మీ తప్పులు చెప్పేందుకు మేము లేము. మీకు 40 రోజులు ఉంచుతామని వ్రాసి ఇవ్వలేదు అని మెల్లగా చెబితే సరిపోతుంది కదా.

వాక్పారుష్యమేవచఅజ్ఞానం అన్నారు గీతలో. నాకు పరుష వాక్యములాడడం చెడ్డ అలవాటు. దానిని పోగొట్టాలని శ్రీస్వామివారి తపన.

శ్రీ సాయి మాస్టర్ నిలయం కట్టించి ఆమెను అందులోకి ప్రవేశపెట్టి నా చేత పరుష వాక్యములు అనిపించి అది తప్పు అని నాకు తెలిపి అలాంటి సన్నివేశాలలో శ్రీ స్వామివారు ఎలా ప్రవర్తించారో గుర్తుచేసి పరుష వాక్యాలు భవిష్యత్తులో పలకరాదు అనే నిర్ణయం చేయించారు. అలాగే ప్రతి వారికి అలాంటి విషమ పరిస్థితులు కలిగిస్తారు. ఆ పరిస్థితులను మనం నేర్పరియైన నావికులు వారే ఉపయోగించుకుని మన లోపాలు సరిదిద్దుకోవాలి. మన లోపాలు ఏమిటో తెలియకుంటే కోటికంఠాలతో ఘోషిస్తాడు శ్రీ స్వామి. వారి వలె చక్కగా ఆత్మబోధ చేయగల వారు ఎవరూ లేరని నా నమ్మకము. శ్రీ స్వామివారి కృప సదా మనందరికీ ఉండాలని ప్రార్థిస్తూ మీ

పె.సు.

సార్ ఆశ్రయం కల్పించటం సాయిమాస్టర్ నిలయంకే పరిమితం కాలేదు. నిజానికి భక్తులు అనుకునే వారెవ్వరు చేయలేని త్యాగం అది తన సేవకులకు, ఆశ్రితులకు చేయటం సార్ కే చెల్లింది.

సాయి సుబ్రహ్మణ్యం మానసిక ఆందోళనలకు అన్నింటికీ అభయమిస్తూ 2007 లో సార్ గొలగమూడిలో అతని చదువు పూర్తి అయ్యాక నివాసం ఉండేందుకు సూచన ఇచ్చారు. 2008 నుండి సర్ ఇంట్లోనే ఒక గది సాయికి నివాస యోగ్యం చేసారు. 2009 లో అతని పెళ్లి సందర్భంగా 3 గదుల ఇల్లు చేయాలనీ ఎన్నో సంవత్సరాల నుండి పూజ చేసుకుంటున్న సార్ పూజ గదిని అతనికి మరో రూమ్ గా (వంటిల్లు) గా మార్చి సార్ కు ఉన్న చిన్న ఇంటిలోనే ఒక సగాన్ని పోర్షన్ గా మలచి ఇచ్చారు. తన పిల్లలకు సైతం తన ఇంట్లో భాగం ఇవ్వ సంకోచించే ఈ కాలంలో తన ఆశ్రితులకై ఇంతటి త్యాగం చేయటం సార్ కే చెందింది. ఈ సంఘటన తనను చూడటానికి వచ్చిన భక్తునికి వంట చేయుటకై ఇంటి దూలాన్ని వాడిన శ్రీ రామకృష్ణ పరమహంస శిష్యులలో అగ్రగణ్యులు శ్రీ నాగ మహాశయులను తలపిస్తుంది.

శివరత్నాన్ని శ్రీ సాయి మాస్టర్ నిలయంలో ఉంచి B.Ed, M.Ed చదివించారు. నగేష్ హైదరాబాద్ లో ఒక కోర్స్ నేర్చుకుంటానంటే సార్ శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ నుండి 3000 రూపాయలు ఇచ్చారు. ఆ ట్రెనింగ్ ఇచ్చే సంస్థ ట్రెనింగ్ ఇవ్వలేదు, పైగా డబ్బులు ఇవ్వకుండా మోసం చేసారు. సార్ ఆ విషయాన్ని చాలా సీరియస్ గా తీసుకుని "ఇది మన డబ్బులు కావు, భరద్వాజ మాస్టర్ గారివి, అంతేగాకుండా మనమొక అన్యాయాన్ని ప్రోత్సహిస్తున్నామని" నగేష్ కి చెప్పి అతని చేత పోలీస్ కంప్లైంట్ పెట్టించి డబ్బులు ఆ ట్రెనింగ్ ఇన్స్టిట్యూట్ వాళ్ళు వాపసు ఇచ్చేలా చేసారు.

## నిష్కామ కర్మ – నిర్మాణ కార్యాలు

"సాయి మాస్టర్ సేవాట్రస్ట్" ద్వారా పుస్తక ప్రచురణ, భక్తులకు సాయి మాస్టర్ నిలయంలో వసతి మాత్రమే కాక మరెన్నో భక్తులకు ఉపయోగకరమైన భావన నిర్మాణాలు చేపట్టారు.

- పాడుపడిన బ్రహ్మం గారి మఠం ఆలయంగా మార్చి పునర్నిర్మాణం చేసి పూజా వసతి కల్పించారు.
- గొలగమూడిలో నివాసం ఉండదలచుకున్న వారికి అతి తక్కువ rent తో నివాస యోగ్యం అయ్యేలా బ్రహ్మంగారి మఠం ఎదురుగా ఒక భవన నిర్మాణం
- వృద్ధాశ్రమం, ధ్యాన మందిరములు నిర్మాణము చేసి శ్రీ స్వామి ఆశ్రమానికి దారా దత్తం చేసారు.
- సాయి మాస్టర్ నిలయం -2, శ్రీ సాయి మాస్టర్ విద్యాలయం మొ|| నిర్మాణాలన్నీ చేపట్టారు.

సార్ నిర్మాణ కార్యాలు ప్రత్యేకంగా ఉంటాయి. చాలా వరకు పనిలో సార్, సార్ సాంగత్యం కోసం తరచు వచ్చే భక్తులదే పాత్ర. బేలుదారి ఉదయం 8 గంటలకు వచ్చేసరికి ఇసుక తెప్పించటం, ఇటుకలను పనిచేసే స్థలానికి తీసుకువెళ్లటం, సిమెంట్ బస్తాలు తెప్పించటం, సిమెంట్ కలువ కలపటం అన్నీ చేయిస్తారు. దీని వల్ల అనుకున్న దానికన్నా ఎక్కువ పని జరుగుతుంది. కంటేపల్లి బేలుదారు సుబ్బారావు పనిచేసే విధానం (అవసరమైతే ఎంత సమయానికైనా పని చేయటం) అంటే సార్ కి ఎక్కువ ఇష్టం. బేలుదారులకి సహాయంగా అక్కడకి వెళ్ళిన భక్తులు ఉండేవారు. ఆ వచ్చిన భక్తులలో ఇద్దరు, ముగ్గురికి తప్ప మిగిలిన భక్తులకు పని చేసే విధానం కూడా తెలియదు. కానీ అందరూ ఉత్సాహంగా చేసేవారు. స్వామి దయ అన్నట్లు ఆ భక్తులు ఎలాంటి పని ఎలా చేసినా వారికీ ఏ ప్రమాదము జరగలేదు. అచ్చట ఈ పని ఆపని అని భేదం లేక ఎవరు చేయ గల్గిన పని ప్రత్యేకంగా “సార్ చెప్పిన పని” మన మామూలు శక్తికి పదింతలుగా చేస్తుండటం, అది సార్ చేయిస్తుండటం, విరామం సైతం సార్ సూచన మేరకు జరుగుతూ ఉండటం, అలసట తెలియకుండా మధ్యలో సార్ పలకరింపు, దర్శనము లేదా అప్పుడప్పుడు ప్రత్యేకంగా శీతల పానీయాలు (మజ్జిగ, పుచ్చకాయ మొ||) కూడా సార్ ఇస్తుండటం. ఇలా జరిగేవి. అదో సేవ సాధనలా కాక ఎంతో సంతోషంగా ఉండేది. కొన్ని నెలలు రోజంతా ఎండలో పని చేసినా కొంచెం కష్టం అనిపిస్తున్న సార్ సాంగత్యం ఆ సేవ వదులుకోవటానికి ఎవరు సిద్ధంగా ఉండే వారు కాదు. ఈ నిర్మాణ సేవలో పాల్గొనే భక్తులకు పెద్ద పెద్ద ఆపదలు ప్రమాదాలు సైతం సులభంగా తొలగిపోయేవి. ఉదాహరణకు

- ఒకసారి నగేష్ అనే భక్తుడు ఒక కరెంటు పనికి సహాయకునిగా వెళ్ళాడు. అచ్చట ఒక ట్రాన్స్ఫార్మర్ వైర్ షార్ట్ సర్క్యూట్ అయి 10,000 వోల్టుల వైర్ అతనికి తాకినా పెద్దగా ఏమీ కాకపోవటం ఎంత చిత్రమో! అతనితో పనిచేసే లైన్ మాన్ కు వైర్ తగలకుండా ప్రక్కనుండి వెళ్ళినా చేయి బాగా కమిలి పోయింది.
- భట్టు అనే భక్తునికిఎన్నో సంవత్సరాలుగా ఉన్న గ్యాస్ ట్రబుల్ వల్ల శరీరం అసలు కండిషన్ లో లేదు. సార్ పై భారం వేసి అక్కడే ఉన్న సార్ ను స్మరించు కొంటూ ప్రయత్నపూర్వకంగా భవన నిర్మాణ పని చేస్తున్నాడు. ఆ సేవతో స్వామి సార్ ఏమి చేసారో కానీ అప్పటి నుండి గ్యాస్ ట్రబుల్ చాలా శాతం తగ్గిపోయింది.

## సార్ శ్రీ వెంకయ్యస్వామి సమాధికి పూజ చేయటం

శ్రీ సార్ 1989-2006 సం || వరకు శ్రీ స్వామి వారి సమాధికి రెండు పూటలా పూజ చేసేవారు. సార్ పూజ చాలా విలక్షణంగా ఉండేది. భగవాన్ శ్రీ రామకృష్ణుల పూజను తలపించేది. బాహ్య ప్రపంచాన్ని మరచి పూజలో స్తోత్రాలు వాటితో పాటు సార్ హృదయపూర్వక సంభాషణల ఆశు కవితగా ప్రార్థనలతో కూడి ఉండేది. సార్ కు పూజలో అప్పుడప్పుడు శరీర స్థితి మరచి సమయం కూడా గుర్తు ఉండేది కాదు. పూజ టైం అయిపోతే ఇతర సేవకులు నైవేద్యానికి అని తెర వేసేసే వారు. వారి శబ్దానికి సార్ కు బాహ్య స్పృహ వచ్చి ముగించి వచ్చేట్లు ఉండేది. ఇలా 15 సం|| పైగా సమాధి మందిరంలో సార్ వేతనం తీసుకోకుండా పూజారిగా పని చేసారు.

ఒకసారి శ్రీ దర్గాస్వామి స్వామి సమాధి దర్శనానికి వచ్చారని సార్ కి తెలిసి వెళ్లారు. సార్ వెళ్లేసరికి శ్రీ దర్గాస్వామిని సమాధి మందిరంలోకి తీసుకు వెళ్లారు. కానీ సార్ అంటే గిట్టని వాళ్ళు సార్ శ్రీ దర్గాస్వామిని ఎవరి పర్మిషన్ లేకుండా సమాధి మందిరంలోకి తీసుకు వెళ్ళారని అభియోగం చేసి, ఆ నెపంతో సార్ ను పూజ చేయవద్దన్నారు. సార్ అప్పటి నుండి పూజకు వెళ్లకున్నా ఒక్కసారి కూడా వెలితి అనుకోలేదు. అన్ని రూపాలలోని భగవంతుని సేవ మానలేదు. విశ్వ రూపుడైన ఆయనకు విధేయుడై శరణాగతితో జీవించడం అంటే ఇదేనేమో ! అప్పటి సార్ భావం సార్ మాటలలో:

గొలగమూడి, 27-8-05

పూజ్య గురు బంధువులైన లక్ష్మక్క గారికి చి||సాయికి శ్రీ స్వామివారి ఆశీస్సులు సదా కలుగవలెనని ప్రార్థిస్తూ పె.సు. వ్రాయడం. శ్రీ స్వామివారి అడుగుజాడలలో గానీ శ్రీ మాస్టారి అడుగుజాడలలో కానీ శ్రీ సాయీశుని మార్గములో మనం సంపూర్ణంగా నడవలేకపోయినా ఫరవాలేదు. నడిచేందుకు తీవ్ర ప్రయత్నమైనను చేయాలి. తీవ్ర ప్రయత్నం కూడా చేయలేకున్నామంటే ఆ మహనీయులు అంగీకరిచారు. వారేమి మనలను మితిమీరిన కష్టం చేయమనడం లేదు. మనస్సంతా వారి కర్పించమనడమూ లేదు. ప్రతి నిత్యము కొంతకాలం వదలకుండా నామం చేయమనుచున్నారు. అన్నం బయట పెట్టేటప్పుడు మన కృతజ్ఞతా భావం ఎంత తీవ్రంగా హృదయ స్పందనతో ఉంటుందో చూచుకోమన్నారు. ఈ విషయంలో 2సం|| క్రిందటి నా భావనకు నేడు నా భావనకు చాలా భేదముంది. నేను శారీరక బలములో చాలా బలహీనుడనయ్యాను. కానీ నా భావనలో చాలా మార్పు వచ్చింది. మంచినీళ్ళు త్రాగుతుంటే పంచ భూతాత్మ స్వరూపాయ నమః అనే మాట రోజులో ఎన్నిమార్లు త్రాగితే అన్ని మార్లు గుర్తు రావడం ఎంత విచిత్రమో గదా!

మందిరం వాళ్ళు పూజ చేయవద్దు అంటే ఇంతకు ముందు వాదనకు దిగేవాణ్ని. కానీ నేడు అంతయూ మన మేలునకే. శ్రీ స్వామి సర్వ సమర్థులు గనుక ఇది నా మంచికే అనే భావన చెదరకుండా ఉంది. ఇది నాకే విచిత్రంగా ఉంది. ఇది ప్రతి ఒక్కరికీ వర్తిస్తుంది. సప్త సముద్రాల అవతల ఉన్నా నిన్ను కాపాడుతానని సాయికి వారి గురువు చెప్పినా సాయికి కష్టాలు తప్పాయా. కుస్తీలో ఓడిపోయి ఊరి వెలుపల ఉన్నాడు. అందరూ తెచ్చుకునే నీటి తొట్టిలో తన డబ్బాను ముంచనివ్వలేదు. అంతటి మహనీయునే చంపాలని కర్ర ఎత్తాడు. వెలుగులోకి రాని ఇంకెన్ని బాధలు పడ్డాడో. ఆ పూటకు బియ్యం లేవు. ఇంటి బాడుగ కట్టగలడా. భార్య వైద్యానికెట్లా? వచ్చే అతిధులనేమి చేయాలి. కులభ్రష్టుడని వెలివేయడం, తన సొమ్ము తిన్నవారే తనపై దుమ్మెత్తి పోయడం. వారికే తప్పనివి మనకు తప్పవు గదా? అంతయూ మన మంచికే.

---

## ఆరతులు – సత్సంగం

అలానే సాయి మాస్టర్ నిలయం నిర్మాణం అయ్యాక అచ్చట సార్ చేసే ఆరతి, సత్సంగం ఎంతో సజీవంగా, మంత్ర ముగ్ధంగా ఉండేవి. సార్ ఆరతి అయ్యాక కొద్దిగా నాలుగు మాటలు చెప్పేవారు. ఆరతి పాడుతున్న కొద్దిసేపు కూడా మనసు ఆరతి పాటపై, స్వామిపై లగ్నం కాకుండా చేయవలసిన ప్లాన్ లు వేయటాన్ని "నీ ఆలోచనలే అహంకారము" అని చెప్పేవారు. అది పోవటానికి ఆరతి పాటలలోని చరణాలను బాగా అర్ధవంతంగా మననం చేసుకొని హృదయగతం చేసుకోవాలని చెబుతుండేవారు. ఉదాహరణకు

- "అనంతమైన నీ పాద సేవను కోరితినో దేవా" అన్నదానికి వ్యాఖ్యగా "Two Church Builders" అనే కథతో అన్ని జీవులలోని అందరిలోని భగవంతుని గుర్తించి సేవ చేయటం అని చెప్పే వారు.
- అలానే "నీ భక్తుల దాసుని కరుణించుము శ్రీ హరి" అన్నదానికి "విద్యుత్ దీపాలు లేని షిరిడి లో అర్ధ రాత్రి బాబా దర్శనానికి యాత్రికులు వస్తే బాబానే లాంతరు పట్టుకొని ఎదురు వెళ్లి "కౌన్ రే !" అని ఎలా భగవంతుని సేవించే వారో చెప్పేవారు. సాయి మాస్టర్ నిలయంలోని నిర్వాహకులు లేని కొన్ని నెలలు (సం||) కాలం తన ఇంటిలో కాక సాయి మాస్టర్ నిలయం బయటి రూమ్ లో పడుకొని అర్ధ రాత్రి ఎవరన్నా వచ్చినా గేటు తీసి స్వామి సేవకుల సేవకు వినియోగమవటం ఎంతటి ఆచరణాత్మక బోధో గుర్తించగలము.
- శ్రీ సార్ (నీభక్తుల దాసుని అన్నట్లు) ఎందరినో అనాథలను – చూసే ఆసరా లేక రోగంతో బాధపడే వారిని మదర్ థెరిసా ఆశ్రమానికి చేర్చటం, సార్ తనకు వచ్చే కొద్దిలో డబ్బులు మిగిల్చి అచ్చట సమర్పించటం చేసే వారు.

సార్ సత్సంగం కూడా అచ్చటి వ్యక్తుల దైనందిన అంశాలను స్పృశిస్తూ హృదయాన్ని తాకే విధంగా ఉండేది. అప్పటి ఆ వ్యక్తుల మానసిక సంఘర్షణలకు చక్కటి సమాధానమై నిలిచేది. ఉదాహరణకు ఒక సమయంలో వేణుగోపాల్ గారు ఇంక వాలంటరీ రిటైర్ మెంట్ తీసుకుందామని, ప్రసాదు తన job చాలా రొటీన్ గా ఉండి మానేద్దామని దృష్టితో సార్ వద్దకు వచ్చారు. సార్ సత్సంగం చెపుతూ మధ్యలో

"job మానేస్తే ఏమి తింటావు. మానొద్దు" అని ప్రసాద్ వంక వేలు చూపుతూ అన్నారు. అది ఈ ఇద్దరికీ సందేశం అయింది. సార్ పది సంవత్సరాలకు పైగా గొలగమూడిలో శ్రీ బ్రహ్మం గారి మఠంలో సత్సంగం విధిగా నిర్వహించారు.

ఆరతి, సత్సంగందగ్గర సార్ గుడి వద్దకు దర్శనానికి వెళుతుంటే సార్ వెనుక రామదండులా కొద్దిమంది పిల్లలు (పెద్దలు) ఉత్సాహంగా వెంటపడుతూ ఉండేవారు. సార్ "ఇంట్లో తినటానికి, కొద్ది విశ్రాంతి కి గడిపే (రోజులో)" అతి కొద్ది సమయం మినహా, మిగిలిన సమయం అంతా సార్ ను చుట్టు ముట్టి ఈ రామదండు ఉండేది. సార్ పై ప్రీతితో అనుసరించే వారిని ప్రేమతో నడిపించటమే కాని ఆ దంపతులు మరోలా స్పందించి ఎరుగరు. తరచు వచ్చే భక్తులు సార్ ను తమ బలహీనతల నుండి బయట పడటానికి గాని, కష్టాలు, అవసర సందేశాలు, కోరికల గూర్చి కాని వేధించే విధం చాలా ఇబ్బందిగా ఉండేది. మార్చి మార్చి అడిగినదే ఎన్నో సార్లు అడిగినా, చెప్పినదే ఎన్నో మార్లు చెప్పుకొంటున్నా, సమయ సందర్భాలను అనుసరించి సూచనలు సాయం చేసే వారే తప్ప తానుగా విసుక్కొని చెప్పక్కర్లేదనేది ఉండదు.

సార్ ఇతరులకు తనను ఆశ్రయించిన వారికిచ్చే ఆర్థిక సాయం కాని, accessability కాని, ఉండటానికి మరో రూపేణ చేసే సాయం కాని అలాగే ఉండేవి. సార్ కు వచ్చే9000 రూపాయల పెన్షన్ లో 3 వంతులు చేసి ఒక భాగం అమ్మ గారికి, ఒకటి శేషయ్య కు ఒకటి తనకు అని ఉంచి తన బాగం 3000 రూపాయల్లోనే లోనే కనీస అవసరాలను కొద్ది కర్చుతో ముగించుకొని మిగిలిన దానితో చదువుకునే విద్యార్థులకు, మదర్ థెరిసా ఆశ్రమానికి ఇలా సాయం చేసే వారు.

ఇలా నిస్వార్ధంగా జీవిస్తున్న సార్ కు స్వామి అడుగడుగునా ఇచ్చిన అద్భుత మైన అనుభవాలను "గురు స్తుతి" పుస్తకంలో సార్ మాటల లోనే పూర్తిగా చూడవచ్చు. ఈ"గురుస్తుతి" పుస్తకాన్ని సార్ స్వానుభవాలు – autobiography గా పరిగణించవచ్చు. 2005 సం|| లో జరిగిన ఒక అద్భుతాన్ని సార్ తరచు చెప్పే వారు. సార్ పెరటిలో నార దబ్బ కాయల చెట్టు, బత్తాయి కాయల చెట్టు వుండేవి. తినటానికి బాగుంటాయని "బత్తాయ కాయ చెట్టు" ఉంచి, నారదబ్బకాయల చెట్టు మాత్రం కొట్టించేసారు. కానీ చిత్రంగా మరుసటి కాపు "నార దబ్బకాయలు" కాసాయి. సార్ ఇది చూపించి స్వామి "తాను సర్వ సమర్దుడను అని చెబుతున్నారని", "మన

ఆలోచనలు తీసేసుకో మంటున్నారని", "Sit Quite: వారి సర్వ సమర్థతను గుర్తించి మనసు నిశ్చలం చేసుకోమంటున్నారని" మరలా మరలా చెప్పేవారు.

సార్ చేసే ప్రతి కార్యానికి స్వామి అనుమతి తీసుకునేవారు. ఉదా: ఒక సారి 2005 లో బోర్ వేయించాలని ఎక్కడ వేయించాలో తెల్పమని దీక్ష చేయబోయిన ముందు రోజు రాత్రి కలలో శ్రీ మహా విష్ణువు మౌల్డింగ్ దానిపై "శ్రమతో సేవ – సేవతో కైవల్యం" అనే దివ్య సందేశం ఇవ్వటం గుర్చి వ్రాసిన letter ఇచ్చుట చూడ వచ్చు.

**"శ్రమ చేస్తేనే కానీ సేవ కాదన్నమాట. గనుక నేను శ్రమించటం -నా ధ్యేయంగా పుస్తకాలు వ్రాయటం, విక్రయం, సత్సంగం చేయాలి. అలా చేస్తేనే కైవల్యం పొందుటకు అర్హులమై ఉంటాము. శ్రమ చేయించేది ఆయనే అయినా శ్రమ చేసే readiness మన దగ్గర వుండాలి. సోమరితనం మన ప్రధమ శత్రువు అంటారు మాస్టర్ గారు. అది దరి చేరకుండా మన శరీరాన్ని కంట్రోల్లో పెట్టుకోవాలి".**

## సార్ అస్వస్థత – భక్తులు సేవించుకొనుట

సార్ కి 2012 ఆగష్టు 12వ తారీఖున నోరు, రెండు కాళ్ళు, రెండు చేతులకి పక్షవాతం వచ్చింది. 25 సం||లు ఉప్పు, కారం, పులుపు, నూనె తినని, బి.పి. కానీ షుగర్ గానీ లేని, ఏనాడూ ఎవరినీ కోపంగా అరిచే స్వభావం లేని సార్ కు ఎందుకు పక్షవాతం వచ్చిందో సార్ కే తెలియాలి అంటే అతిశయోక్తి కాదని మీకే తెలుస్తుంది. సార్ యొక్క శరీరం రెండు చేతుల పిడికిళ్ళు బిగించిన ఫోటోలోని వెంకయ్యస్వామిలాగా ఉన్నారు. డాక్టర్ హరి ప్రసాద్ గారు మందు ఇచ్చారు.

సాయి సుబ్రహ్మణ్యంతో సార్ మాట్లాడుతూ "అనుకుంటే బాగైపోవాల" అని గంభీరంగా అన్నారు. అలానే సార్ కి పక్షవాత ఛాయలు ఒక నెలరోజుల కల్లా దాదాపు పోయాయి. అంత అవస్తలో ఉన్న సార్ మాటల్లో సర్వజ్ఞత్వం ప్రకటం అవటం (మనకు) చిత్రం! కానీ భగవత్ స్వరుపులైన వారికీచిత్రమేమి కాదేమో! అక్కడ ఉన్న వేణుగోపాల్ గారితో "ఇక్కడ ఉంటే ఏమి వస్తుంది, బ్రహ్మం గారి మఠం ఎదురు బిల్డింగ్ సంగతి చూడండి" అని పంపించారు. నిజానికి వేణుగోపాల్ గారు మనసులో ఆ పని ఉండిపోయింది అనే అప్పుడు ఆలోచిస్తున్నారట. దాదాపు కొన్ని వారాల తర్వాత మాత్రమే సార్ వాళ్ళ అమ్మాయికి, అల్లుడిగారికి విషయం తెలిసి వచ్చి వాపోయారు.

సార్ వాళ్ళ అల్లుడు సార్ కి ఫిజియోథెరపీ చేయించటం తరువాత సార్ దగ్గర కి రోజు, వారం వారం వెళ్ళే భక్తులు సార్ చేత నడిపించటం, కాళ్ళతో పెడల్స్ తిప్పే పరికరంతో ఎక్సర్సైజులు చేయించేవారు. సార్ కాళ్ళతో పెడల్స్ తొక్కుతుంటే లెక్క పెట్టమనేవారు. ఒకరోజు సాయి లెక్కపెడుతూ మధ్యలో ఏదో ఆలోచనలో పడి మరచి మరల మేల్కొన్నాక అయ్యో సర్ లెక్కపెట్టమన్నారే. లెక్క ఎంత ! అనుకోగానే, సార్(64 అని) లెక్క చెప్పారు. మన మనసులు వారికి ఎప్పుడు తెరిచిన పుటలే నేమో!

సార్ తమకి ఆసరాగా ఉండటానికి, పైకి లేవటానికి ఇంకొకర్ని పిలవకుండా ఉండటానికని ప్రసాద్ చేత సార్ ఎడమచేతి ప్రక్క ఉన్న గోడకి స్టీల్ రైలింగ్ వేయించారు. సార్ ఈ సమయంలో తమంత తాము ఈ రైలింగ్ పట్టుకుని మంచం మీద లేచి కూర్చునేవారు. ఆ సన్నివేశం చూస్తే ఎంత వరకు వీలయితే అంత వరకు ఎవరి మీద ఆధార పడకూడదని చెపుతున్నట్లుంది. ఇదివరలో స్వామి వద్దకు తరచు వస్తూ తనను ఆశ్రయించిన భక్తుల బాగోగులు అడిగి తెలుసుకుని వారి సమస్యలను పరిష్కరించే సార్ ఈ కాలంలో భక్తులు ఎంతో ప్రార్థనతో, ఆర్తితో చెబితే మాత్రమే వినేవారు. అరుదుగా సలహాలను ఇచ్చేవారు.

అమ్మగారి సేవా భావాన్ని మనం చూచి ఎంతైనా నేర్చుకోవచ్చు. పెళ్లి కాక ముందర చాలా గారాబంగా పెరిగిన అమ్మగారు సార్ ని పెళ్లి చేసుకున్నాక సార్ కి అనుగుణంగా ఉండి ఎన్నో పనులు – పేడ ఎత్తటం మొదలైనవి సమర్ధవంతంగా చేసేవారు. అంతేగాక ఒకసారి కలిచేడు సాయిబాబా మందిరంలో పెట్టాల్సిన సాయిబాబా ఫోటో సార్ వాళ్ళింట్లో పెట్టారు. సార్ అమ్మగారిని 4 ఆరతులు ఇమ్మన్నారు. ఆరతులు అమ్మగారు ఇస్తున్నప్పుడు నిద్ర తూగేది. దానికి కారణం తము తినే ఊరగాయ పచ్చడ్లు అయితే అని మానేస్తాను అని అనుకున్నారు. అంతే ఆనతి నుండి ఊరగాయ పచ్చళ్ళు తినరు. భగవంతునికి మాట ఇస్తే అలా ఉండేవారు. అంతేగాక సార్ ఆయాసం ఎంత తీవ్ర స్థాయిలో ఉంటుందో అమ్మగారికి తప్ప మరెవ్వరికీ తెలియదు. అంతేగాక సార్ ఒకసారి స్వామి ఇచ్చిన నియమాన్ని ఉల్లంఘించినప్పుడు సార్ చాలా ఇబ్బంది పడ్డారు. అంతేగాక స్వామి చెప్పినట్లు చేసిన వెంటడే ఎన్నో రోజులుగా ఉన్న ఆయాసం తొలగిపోవటం అమ్మగారు ప్రత్యక్షంగా చూసారు. అప్పటి నుండి సార్ కన్నా

అమ్మగారు స్వామి నియమం పట్ల అప్రమత్తులుగా ఉండేవారు. సార్ పక్షవాతం వచ్చినప్పుడు అమ్మగారిది నిరంతర సేవ అన్నట్లు ఉండేది.

- ఉదయం 5గం30ని||లా కల్లా కోటేశ్వరరావు, హర్షవర్ధన్ గారు వస్తారు. సార్ కి అన్ని పనులు చేసే సరికి ఉదయం 7 గంటలు అవుతుంది. అప్పటిదాకా అమ్మగారు కూర్చుని అన్నీ చూస్తూ ఉంటారు.
- సార్ కి టిఫిన్ సుమారు 9 గంటలికి పెట్టటం మొదలు పెడితే 9:30నుండి 10:30 వరకు పెట్టటం జరుగుతుంది. అమ్మగారు సుమారు 11 గంటలకు టిఫిన్ చేస్తారు. మధ్య మధ్యలో సార్ పిలిచి తమని లేపి వీపుకి ఆనుకుని కూర్చోమంటారు.
- నిదానంగా వంట అయ్యి సార్ కి అన్నం పెట్టటం సుమారు 3 గంటలకి పెట్టటం ప్రారంభిస్తే అయ్యేసరికి సుమారు 4గం||లు అవుతుంది. సుమారు ఒక 30 నిముషాలు సార్, అమ్మగారు పడుకుంటారు.
- సాయంత్రం 4గంటల 30నిమిషాలకు సార్ కి స్నానం చేయిస్తారు. మొత్తం అంతా అయ్యేసరికి 5గంటలు30నిముషాలు అవుతుంది.
- సార్ కి ఇడ్లీలు రాత్రి 9 గంటలకు పెట్టడం ప్రారంభిస్తే సుమారు 10గంటలకు అవుతుంది. సార్ కి మంచినీళ్ళు త్రాగటం చాలా ఇబ్బందిగా ఉండి అంత లేటు అయ్యేది. మ్రింగుడు పడేవి కాదు. అంతా అయిన తర్వాత అమ్మగారు పడుకుని ఒక కునుకు తీసేసరికి రాత్రి 11 గంటల పైన అయ్యేది.
- అప్పుడు లేచి స్నానం చేసి దేవుడికి దీపం వెలిగించి అన్నం తినేసరికి రాత్రి 12 గంటల 30నిముషాలు పైన అవుతుంది. సార్ ప్రక్క తడిస్తే చాలాసార్లు అమ్మగారే శేషయ్య సాయంతో శుభ్రపరిచేవారు. సుమారు రాత్రి 1గం పైన పడుకుని ఉదయం 5గం||30ని||లకు నిద్ర లేచేవారు.
- రోజులో సార్ కి 5 సార్లు మందులు వేయాల్సి వచ్చేది. ఆయా సమయాలు గుర్తుంచుకుని అమ్మగారు మందులు వేసేవారు.
- మద్యాహ్నం4 గం ఒంటి పూట భోజనం, ఉదయం రాత్రి 11 గం టిఫిన్ తింటూ రోజుకు 5 గం మాత్రంపడుకుంటూ ఆ పెద్ద వయసులో నిరంతరం సార్ కు అలా సేవ చేసుకునే వారు అమ్మగారు.

నిద్ర ముంచుకు వస్తున్నా సార్ కి అమ్మగారే స్వయంగా అన్నం పెట్టేవారు. ఎన్నిసార్లు సార్ కి అన్నం పెడుతూ స్టూల్ మీద కూర్చుని నిద్రకి ఓర్వలేక తూగేవారో! ఎన్నోసార్లు అమ్మగారు సార్ కి అన్నం పెట్టిన తర్వాత స్టూల్ మీద కూర్చుని TV చూస్తూ ఉంటే సార్ అమ్మగారిని ప్రేమగా, తృప్తిగా చూసేవారు. అమ్మగారికి ఒక్క క్షణం తీరిక ఉండకపోవటానికి ఇంకొక ముఖ్య కారణం సార్ ని చూద్దామని వచ్చిన వారికి సమాధానం చెప్పాలి. ఎవరైనా సార్ తో ఎక్కువసేపు మాట్లాడితే సార్ కి నిద్ర తక్కువ అవుతుందని వాళ్ళని నిగ్రహించాలి. బయట గాలి వస్తే సార్ కి హాయిగా ఉంటుందని ఇంటి తలుపులు వేసేవారు కాదు. అందువలన అమ్మగారు ప్రతి నిమిషం అప్రమత్తులై సార్ ని చూసుకోవలసి వచ్చింది.

సార్ కి పక్షవాతం రాక ముందర దాకా అమ్మగారు రాత్రిపూట ప్రక్కనే ఉన్న శ్రీ సాయి మాస్టర్ నిలయంకి వెళ్లి శ్రీ భరద్వాజ మాస్టర్ కి నమస్కారం చేసుకుని వచ్చేవారు. సార్ కి పక్షవాతం వచ్చిన తర్వాత అమ్మగారికి ఒక్క నిమిషం తీరిక లేక ఇంట్లోనే నమస్కారం చేసుకునేవారు. ఒక రకంగా చెప్పాలంటే సార్ అమ్మగారి శరీరం, మనస్సుని నిరంతరం తమ ధ్యాసలో ఉంచినట్లు అనిపిస్తుంది. అమ్మగారు సార్ ని విడిచి ఉండలేకపోయేవారు. సార్ కూడా పలమనేరు దగ్గర డాక్టర్ వద్దకు వెళ్ళాలంటే అమ్మగారిని బ్రతిమలాడి తమతో తీసుకు వెళ్లారు. సార్, అమ్మగారు అంటే శివుడు, పార్వతి అని చెప్పుకోవటంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు! సార్ ఆ పరిస్థితుల్లో కూడా భక్తులకు అనుక్షణం ఎన్నో అనుభవాలిస్తున్నారు. ఉదాహరణకు

- సార్ దగ్గరకొచ్చే భక్తులు 2013 జూన్ 9న కడుతున్న ధ్యాన మందిరం దగ్గర మట్టి గుంటల్లోకి త్రోసి అక్కడే వున్న చెట్టు క్రింద కూర్చుని సార్ గురించి మాట్లాడుకున్న తర్వాత బయలుదేరి వస్తూ స్వామి ఆశ్రమం దగ్గరకి వచ్చేసరికి పాబోలు వెంకటేశ్వరరావు స్వామి ఆశ్రమం ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ కి ఇవ్వవలసిన పేపర్లు తీసుకు వచ్చాడు. అతను చెపుతూ సార్ ఇప్పుడే అడిగారు “వాళ్ళు పని చేస్తున్నారా? చెట్టు క్రింద కూర్చుని కబుర్లు చెపుతున్నారా?” అని అన్నాడు. ఎక్కడో దూరంగా చేసే పని సార్ కి తెలుస్తోందని, సార్ ఈ సమయంలో కూడా మన పనిని పర్యవేక్షిస్తున్నారని అందరూ ఆశ్చర్యంతో నవ్వుకున్నారు. సార్ అన్ని చోట్ల వున్నారు కదా!

- శ్రీ సాయి మాస్టర్ విద్యాలయానికి గవర్నమెంట్ అనుమతి కావటానికి ఎన్నో సర్టిఫికెట్స్ ఇవ్వాలి. వాటిలో ముఖ్యమైనది స్థలం రిజిస్ట్రేషన్. ఇది తెలుసుకున్న వేణుగోపాల్ గారు శ్రీ వెంకయ్యస్వామి సమాధి మందిరంలో ప్రదక్షిణలు చేస్తూ మనస్సులో సార్ కి చెప్పుకున్నారు "సార్! ఈ స్థలం రిజిస్ట్రేషన్ మా వల్ల కాదు. మీరే చేయించాలి" అని చెప్పుకున్నారు. మరుక్షణమే తన కొలీగ్ కోటేశ్వరరావు గారి చెల్లెలు నెల్లూరు దగ్గర ఎక్కడో రిజిస్ట్రేషన్ ఆఫీస్ లో పని చేస్తున్నారని గుర్తు వచ్చి ఫోన్ చేసారు. అయన చెల్లెలు ముతుకూరు రిజిస్ట్రేషన్ ఆఫీస్ లో పని చేస్తోందని తెలిసింది. ఆవిడ దగ్గరకి 5,6 సార్లు వెళ్ళినా పని అవ్వలేదు. ఒకరోజు ఆ ఆఫీస్ కి వెళ్ళ బోతూ వేణుగోపాల్ గారు సార్ దగ్గరకు వచ్చి "మీరే చేయించాలి సార్" అని ప్రార్థించారు. సార్ వెంటనే "వెళ్లి రాండి" అని ఆశీర్వదించారు. కోటేశ్వరరావుగారి చెల్లెలు కూడా తమ ఇంట్లో సాయిబాబాకి ఆ రోజు ఎలా అయినా పని అయ్యేటట్లు చూడమని చెప్పుకుంది. ఆ రోజు మొత్తం పని అంతా 4 గంటలలో పూర్తయింది.

సార్ కి పక్షవాతం వచ్చినప్పుడు తరచుగా గురుసేవ చేసుకోగలిగిన అదృష్టవంతులు - నగేష్, ప్రసాద్, కోటేశ్వరరావు, పాటోలు వెంకటేశ్వర్లు, శివరత్నం, హర్షవర్ధన్ గారు మొ|| వారు. నగేష్ సార్ కి హాయిగా ఉండటానికి బెడ్ తీసుకు రావటం, బయటకు తీసుకు వెళ్ళటానికి వీల్ చైర్ తీసుకురావటం, సార్ కి హెయిర్ కట్, గడ్డం గీయటం, గోళ్ళు తీయటం ఎంతో శ్రద్ధాభక్తులతో చేసేవాడు. సార్ ఆరోగ్యం ఎప్పటికప్పుడు కనుక్కుంటూ సరైన డాక్టర్ ను నెల్లూరు నుండి తీసుకురావటం, పలమనేరు అనే చోట మందుకు సార్ ను, అమ్మగారిని, అందరిని ఒప్పించి తీసుకు వెళ్ళటం, సార్ అవసరాన్ని గుర్తించి తగిన అవసరాలు ఇలా ఎన్నో నిరంతర చింతన, గొప్ప శ్రద్ధ భక్తులతో చేశాడు కనుకనే సార్ సమ్మతి లభించి జరిగాయి. గొలగమూడిలో నివసించే పాటోలు వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, హర్షవర్ధన్ గారు ఈ పై కార్యాలన్నింటిలో ఎంతో సమయం వెచ్చించి సేవ చేయటమే కాక ఎంతో సమర్థ వంతంగా కావలసిన వసతులను భక్తి భావంతో సమకూర్చేవారు. శివరత్నం వైద్యంలో ప్రవేశం ఉండటం వల్లహోమియో మందు ఇప్పించటము, రోజూ రాత్రి సార్ కు నిద్ర ముందు అన్నివిధాలా సదుపాయంగా ఉండేలా సేవ చేసేవారు. ఎప్పుడు అవసరమైతే అప్పుడు వెంటనే సార్ సన్నిధికి ప్రసాద్ వచ్చి సేవ చేసేవాడు.

సార్ గాడంగా నిద్ర పోయేవారు. కానీ ఏనాడూ సార్ కి కళ్ళు ఉబ్బలేదు. పైగా అంత నిద్ర నుండి లేవగానే కొంచెం మంచినీరు కూడా త్రాగకుండా అన్నం తినేవారు. ఒకరకంగా చెప్పాలంటే సార్ శరీరం ఆ స్థితి లో కూడాడా మంచి కండిషన్ లో ఉండేది. సార్ మామూలుగా నడిచేటప్పుడు భోజనానికి, పనులకు ఎవ్వరి మీద ఆధారపడలేదు. పైగా సార్ ని ముట్టుకునే అవకాశం ఉండేది కాదు. సార్ కి పక్షవాతం రావటం భక్తులందరూ సార్ ని ముట్టుకునే అవకాశం కలిగించడానికా అన్నట్లు ఉంటుంది. సార్ అంతకు ముందంతా నిరంతరం నిష్కామకర్మగా ఏదో పని చేస్తున్నా ఇప్పుడు నిష్క్రియులుగా ఒంటరిగా పడుకునే ఉండాల్సి వచ్చినా ఏమాత్రం దైన్యం కానీ స్వామి ఇలా చేసారే అని కాని, అసంతృప్తిగా కానీ ఉండేవారు కాదు. సార్, గంభీరత, మార్గ దర్శకత్వం, శరణాగతి ఈ సమయంలో కూడా ప్రకటమయ్యేది.

ఒకసారి ప్రసాద్ ని సార్ తనని లేపి కూర్చోమన్నట్లు సైగ చేసారు. కానీ ప్రసాద్ సార్ ని లేపుతున్నప్పుడు సార్ లేవకుండా రెసిస్ట్ చేసినట్లు ఉంది. దాంతో ప్రసాద్ సార్ తో మాట్లాడుతూ మీరు బాగా బరువుగా ఉన్నారు సార్ అన్నాడు. సార్ వెంటనే ప్రసాద్ ని తిట్టి **పని చెయ్యలేకపోతే ఇక్కడ కెందుకొచ్చావు** అని అన్నారు. మరోసారి సార్ ప్రసాద్ ని వీపు గీరమన్నారు. ప్రసాద్ వీపు గీకుతూ సార్ తో 'సార్! మీరు ఇదివరలో మలబద్ధకం పోగొట్టుకోవటానికి ఎన్నో ప్రయత్నాలు చేసేవారు కదా! దర్గాస్వామి మీకు నరాల బలహీనతే అన్నారు, అందువలన ఏ ఆహారం తింటే బాగుంటుందో మాకు చెప్పవచ్చు కదా!" ప్రార్థించాడు. సార్ వెంటనే "వీపు గీరమంటే 99 ప్రశ్నలు! ఇచ్చిన పని చెయ్యి" అన్నారు. ఇంకొకసారి ప్రసాద్ సార్ తో 'సార్! అమ్మగారు కష్టపడి మీకు సేవ చేస్తున్నారు కదా! మీకు త్వరగా కోలుకోవాలని లేదా?' అని అడిగాడు. సార్ "నాకు ఎలాంటి ఆలోచనలు ఉండవు" అన్నారు.

ఒకసారి సాయితో "పడుకొని కండ్లు మూసుకుంటే స్వామి రూపే కనపడుతుందని", వారి హృదయగత ఆనందాన్ని అనుభవించటంలో, ఏకాంతంలోనే తృప్తిగా ఉన్నట్లు ఆ సంవత్సరాలన్నీ గడిపేవారు. చాల అరుదుగా మాట్లాడే వారు, ఇతరులు చెప్పినవి వినేవారు.

చాలామంది భక్తులు సార్ కి సేవ చేసుకునే భాగ్యం కలిగింది. సార్ కి సేవ చేయటంలో వారికి ఉన్న మానసిక ఆందోళనలన్నీ తొలగిపోయేవి.

2015వ సం|| నవంబరు 29వ తేది నుండి డిసెంబర్ మొదటి వారం వరకు చెన్నైని భారీ వర్షాలు, వరదలు ముంచెత్తాయి. శ్రీ రామకృష్ణ భట్టు(చెన్నై) గారి స్నేహితులు ఉండే ప్రాంతాల్లో మొదటి, రెండవ అంతస్థుల దాకా వరద నీరు వచ్చేసిందని ఊరు విడిచిపోతున్నారు. తాను ఉండేది గ్రౌండ్ ఫ్లోర్ లో కాబట్టి ముఖ్యమైన సర్టిఫికెట్లు, విలువైన వస్తువులు మూటకట్టి పెట్టుకున్నాడు. ఎక్కడా కరెంటు కానీ ఫోన్లు కానీ రవాణా సౌకర్యాలు కానీ లేవు. డిసెంబర్ 2వ తేది మధ్యాహ్నం వరకు శ్రీ రామకృష్ణ ఉండే ముగలివాకం ప్రాంతంలో పెద్దగా నీరు చేరలేదు. కానీ సాయంత్రం 4 గం||లకి వారి ప్రహరి గోడ ప్రక్కన 3 అడుగులు పైగా నీళ్ళు చేరేసరికి చాలా భయమేసింది. వర్షం జోరుగా పడుతోంది. అలానే కొనసాగితే ఇక ఇంటిలోకి నీరు చేరటం తథ్యం. ఆ ఆలోచనలతో ఇంట్లోకి వెళ్లి పడకగదిలో కూర్చుంటే ఆ వర్షం హోరుకి చెవులు చిల్లులు పడేలా ఉన్నాయి. ఇక ఆ టెన్షన్ తట్టుకోలేక వెంటనే సార్ ని మనస్సులో తలుచుకొని “సార్! నాకు భయమేస్తోంది. ఈ పరీక్ష చాలు. దయచేసి రక్షించండి” అని చెప్పుకున్నాడు. వెంటనే అంత జోరుగా టప టప టప టప మని కురుస్తున్న వాన చప్పుడు ఆగిపోయి, చిన్నగా టపా......టపా అని చూరునీళ్ళు పడుతున్నట్లుగా మారిపోయింది. బయటకి వచ్చి చూస్తే అప్పటిదాకా ఆకాశం చిల్లులు పడినట్లు కురిసిన వాన చిన్న చిన్న చినుకులుగా మారిపోయింది. అ క్షణాన “సార్ కూడా ఉన్నారు” అనే ధైర్యంతో అతని భార్యతో మనకేమీ భయం లేదు అని చెప్పాడు. అలాగే క్రమంగా  వర్షం తగ్గి, ఏ ఇబ్బందీ లేకుండా గడిచిపోయింది.

సార్ కు స్వామి పట్ల ఉన్న భావము, కృతజ్ఞత, విశ్వాసము, తృప్తి  ఈ letter లో ప్రకటము అవుతాయి.

Om

గొలగమూడి, 13-6-05

Dear Sai,

మానవుని దుఃఖమునకు కారణము- కోరిక అన్నారు బుద్ధుడు. శ్రీ స్వామివారు "ఆశ" అన్నారు. ఇది అంటే ఆశ ఎంత నికృష్టంగా పనిచేస్తుందో చెప్పలేను. మనం ధర్మ బద్ధంగా ఉన్నాము అని అనుకుంటూనే మనము తప్పు దారిన నడిచేటట్లు చేస్తుంది. ఎవరు అలా చేసేది – మన ఆశయే.

ఒకే ఒక principal కు stick on అయి ఆ పని, ఆ ప్రిన్సిపల్ తప్ప తక్కిన వాటికీ మన బుర్రలో తావివ్వకూడదు.

నేను తప్పు చేస్తున్నానో, రైట్ చేస్తున్నానో నాకు తెలియదు. శ్రీ స్వామివారి ఆజ్ఞననుసరించి గొలగమూడిలో ఉండాలి. అలా ఉంటూ వారి సేవ చేయాలి. ఆ నిర్ణయానికి వచ్చాక అన్ని మార్గాలు వారే ఏర్పరిచారు. 1. వారి కృపతో నెల్లూరు గానీ ఇతర చోట్లకు గానీ వెళ్ళే అవసరం లేకుండా చేసారు. 2. వైద్యానికి కూడా పంపడం లేదు. 3. బంధువుల వివాహాలు, కర్మ క్రతువులు మాన్పించారు. పెన్షన్ మా ముగ్గురికీ మూడు భాగాలూ పెట్టి వాళ్ళ రెండు భాగాలూ వాళ్ళకిచ్చి నా భాగమే నేను ఖాళీ చేస్తున్నాను. మిగిలితే (నా భాగంలో) మదర్ తెరెసా ఆశ్రమం కు ఇస్తున్నాను. ఇవన్నీ నేను చేసినవి కావు. **నీ ఆజ్ఞ పాటించి నీ మార్గాన నడుపు తండ్రీ అనే ఒక్క ప్రార్థన ఒక్క నిర్ణయము మాత్రమే చేశాను. మిగిలినవన్నీ వారే వనగూరుస్తున్నారు. ఇది నీవు బాగా యోచించు.**

**సార్ పై ఆధారపడే వారికీ సార్ అభయం ఈ క్రింది letter లో ప్రకటం అవుతుంది:**

గొలగమూడి, 18-9-05

పూజ్య గురుబంధువులైన శ్రీమతి లక్ష్మక్క గారికి, చి|| సాయికి శ్రీ స్వామివారి ఆశీస్సులు సదా కూడా ఉండాలని ప్రార్థిస్తూ వ్రాయడం. (P.S.R). అమ్మా

మనకున్నంత మంది అండ, ఆపు, ఆప్తులు, మిత్రులు, బంధువులు మరెవ్వరికీ లేరు. ఎందుకిలా చెపుతున్నానంటే ఆ మహనీయుడు మనవాడై ఉండగా అందరూ మనవాళ్ళే. మనకెవ్వరూ లేరనే భావం మనకు రాకూడదు. ఇప్పుడు మనకవసరం లేదు గనుక అందరికీ దూరం పెట్టాడు. మనకవసర మైనప్పుడు అందరినీ మనచుట్టూ పెట్టారు. మన గురుదేవుడు ఏమారక మన హృదయంలో ఉన్నాడని మనం నిరంతరం ఆయన వైపే చూడాలని వారి ప్రతిరూపాలైన ఈ ప్రపంచంలోని రూపాలను పట్టించుకోకుండా మెలగాలనేదే వారి సంకల్పం గనుక మనలను అందరినుండి దూరం చేశాడు. నాకు ఒక్క బంధువు లేడు. స్నేహితుడూ లేరు. నాకు మాత్రం ఎవ్వరూ లేరే అనే భావం లేదు. సాయి మాస్టర్ నిలయంలో తాత నేనిక్కడ ఉండలేను. ఎక్కడికైనా వెళ్ళిపోతానని ఆరాధనకు ముందు నెల నుండి నోటిసు ఇచ్చాడు. O.K. వెళ్ళండి అన్నాను. మా వాళ్ళు ఆయన పోతే ఎట్లా అని గోల పెడుతుంది. నేను అరిగిపోయిన గ్రామఫోను రికార్డు లాగా "ఆయన పోతే మాస్టారు మరొకర్ని తెచ్చి పెడతాడు. ఆయన పోతే మాస్టారు మరొకర్ని తెచ్చిపెడతాడు. ఆయన పోతే ఎట్లా అనేది మనకెందుకు. సాయి మాస్టర్ నిర్వాహకులైన గురువుగారిది గదా ఆ డ్యూటీ అని చెప్పేవాడిని. అంటే ఆయన మనవాడై ఉండగా వేరే చింత, దిగులు ఎందుకు.

---------------------------------------------------------------------

సార్ మాములు మనిషి కాదు సాక్షాత్తు భగవంతుడే అనే ఎన్నో లీలలు "శ్రమతో సేవ –సేవతో కైవల్యం" పుస్తకంలో చూడగలరు.

## మహా సమాధి

సార్ 2017 వ సం|| జూన్ 9వ తేదిన (జ్యేష్ట శుద్ధ పౌర్ణమి) ఉదయం 7 గం|| 20 ని||లకి కన్నుమూసారు. సార్ భౌతికదేహాన్ని శ్రీ సాయి మాస్టర్ నిలయంలో సమాధి చేసారు. సార్ తమ పరిమిత శరీరం వదలి విశ్వ చైతన్యులై సమాధి చెందిన తర్వాత కూడా భక్తులకు అయన నిత్యసత్యులని అనుభవాలిస్తున్నారు.

- శ్రీ సుబ్బరామయ్య గారు శరీరం వదిలాక భక్తులు శ్రీ సాయి మాస్టర్ నిలయంలో సమాధి చేసారు. దమ్మపేట నుండి వచ్చిన ఒక పెద్దావిడ సార్ సమాధి చూసి

మామూలు మనిషిని సమాధి చేయటమేమిటని అనుకుని జూన్ 10వ తేది (2017)ఉదయం 10గం||30ని||లప్పుడు శ్రీ సాయి మాస్టర్ నిలయంలో పడుకుంటే సార్ ఫోటోలో నుండి బయటకు వచ్చి దత్తాత్రేయుని ఫోటోలో కలిసిపోయారు. వెంబడే మెలుకువ వచ్చిన ఆవిడకి మనస్సులో "సుబ్బరామయ్యగారికి, దత్తాత్రేయునికి తేడా లేదని" అనిపించి సార్ సమాధి వద్ద వున్న వేణుగోపాల్ గారితో చెప్పింది. అంతేగాకుండా ఆవిడ మనస్సులో సుబ్బరామయ్య గారితో ఇలా ప్రార్థించింది– స్వామీ! మీరు దేవులైతే నాకు మా ఊళ్లో రావలసిన డబ్బు తీసుకున్న వాళ్ళు అరగంటలో ఫోన్ చేసి డబ్బు ఎప్పుడు వాపసు ఇస్తారో చెప్పాలి అని అనుకున్నారు. అరగంట లోపల అప్పు తీసుకున్న వారు ఫోన్ చేసి ఫలానా రోజు డబ్బు లిస్తామని చెప్పారు.

<u>**సమాధి అనంతరం మార్గ దర్శకత్వం:**</u>

- సార్ సమాధి అనంతరం అమ్మగారికి వచ్చిన ఎన్నో కలలు సార్ అనుక్షణం అమ్మగారితోనూ, మనందరితోనూ ఉన్నారని, వారు మనం చేసేవి చూస్తూ, మనను నడిపిస్తూ ఉంటారని తెలుపుతున్నాయి. సార్ సమాధి అయిన రెండవరోజు అమ్మగారి స్వప్నంలో ఒకరు కనపడి సార్ సాయి మాస్టర్ నిలయం వద్ద ఉన్నారని రమ్మంటున్నారని చెప్పారు. అమ్మగారు అయన ఇంకెక్కడ చాటుకు వెళ్లిపోయారంటే లేదు రమ్మంటున్నారని తీసుకువెళ్ళారు. అచ్చట సార్ అందరికీ పనులు చెప్పి చేయిస్తున్నారు. అమ్మగారికి కూడా పని చెప్పితే అమ్మగారు చేసారు. తరువాత అమ్మగారు సార్ ని ఇంటికి రమ్మంటే సార్ "నాకు ఇచ్చటే బాగుంది, ఇక్కడే ఉంటానన్నారు". భయం వేయదా అని అమ్మగారు అడిగితే అంటే నాకు భయమేమీ లేదన్నారు. సార్ సమాధిలో ఇప్పటికీ, ఎప్పటికీ ఉంటారని అమ్మగారికీ, మనందరికీ తెలపటం కాదా!
- సమాధి అయిన కొద్దిరోజులకు ఒకసారి అమ్మగారు రాత్రి 10:30 నుండి 11:00 గంటలకు అన్నం పెట్టి, బాబాకు దీపారాధన చేసి శేషయ్యకు పెట్టి అమ్మగారు మరలా తిందామనుకుని ఏమీ చేయాలనిపించక బాధగా కుర్చీలో పడుకుంటే సార్ కలలో కనపడి "ఎందుకు ఏడ్చేది? నీవేడుస్తుంటే నేనేం చేసేది? నేను యాడికి పోయాను. వచ్చేసాను" అని మంచంలో పడుకున్నారు. అమ్మగారిని పిలిచి

కాలునొప్పి ఎలా ఉందని అడిగి ఒకసారి నొక్కి చూసి, "దేవుడికి పెట్టావు కదా! ఇడ్లీ తినేసి పడుకోమని" చెప్పారు. మెలకువ వచ్చేసరికి ఇడ్లీ తినలేదని అక్కడే ఉందని గుర్తొచ్చింది. ఇలా మనం చేసే ప్రతి పనీ చూస్తూ భగవంతునికి చేసేదానిని ప్రోత్సహిస్తూ అమ్మగారి చింతను ఇదివరలాగే తొలగిస్తూ ఉన్నారు. మరోసారి అమ్మగారి కమ్మలు పోయాయి. పడుకున్నప్పుడు పడిపోయి ఉంటాయనుకున్నారు. వెతికినా దొరకలేదు. చివరకు సార్ కు విన్నవించుకుంటే మరురోజు ఉదయం వంటిట్లో కనపడ్డాయి. ఇప్పటికీ సార్ సాంగత్య, మధుర స్మృతులను తలచుకుంటూ అమ్మగారు కండ్లు చెమరుస్తుండటం అమ్మగారికి, సార్ కు గల ప్రేమానుబంధాలను తెలుపగా వారి ఆదర్శ జీవితాలు మనకు చక్కటి మార్గదర్శకాలు.

- శ్రీ సార్ సమాధి అనంతరం కూడా అదే రీతిన, ఇంకా ప్రస్ఫుటంగా నడిపిస్తున్నారు అనటానికి ఒక ఉదాహరణ చెప్పి సాయి ఇలా చెబుతున్నాడు. సమాధి అయిన రోజు కార్యక్రమం అయ్యాక వెళ్ళుతూ train లో సార్ కు ఏదో చేయాలి అని సార్ ఉత్తమగతులకోసం అన్న ఒక ఆలోచన వచ్చింది.

ఆ రోజు కలలో సార్ దివ్యంగా భౌతికంగా ఎప్పటి వలె మనందరితో పని చేయిస్తూ కనిపించారు. శ్రీ సార్ కు ఉత్తమగతి గూర్చి కాదు మన కృతజ్ఞతతో సార్ ప్రార్ధనతో మనకు ఉత్తమగతి శ్రేయస్సు గూర్చి చేయాలి అన్న సందేశం అనిపించి, మరురోజు నుండి 3 పూటల నైవేద్యం పూజ (40 రోజులు అనుకోని) ప్రారంభించాను. ఒకవారం తరువాత ఆఫీస్ పని మీద వేరే ఊరికి వెళ్ళినప్పుడు(శ్రద్ధ మరలి) ఉదయం నివేదన మర్చిపోయి వెళ్లి పోయాను. మరురోజు రాత్రి సార్ కలలో "ఒప్పుకున్న పని క్షుణ్ణంగా చేయి లేదా ఒప్పుకోకు!" అంటూ దర్శనమిచ్చారు. మనం చేసేది చూస్తూ తప్పులు సవరించటమనే వారి కార్యం నిర్విరామంగా వారి భౌతిక జీవిత పర్యంతం కూడా సదా సాగుతుందని గుర్తింప చేస్తున్నారు.అలాగే మరోరోజు ఏదో విషయమై చర్చ వస్తే సార్ మా ఇంటి పూజ గదిలో "ఈ ఇంటి యజమానిని నేనే" అన్న రీతి కూర్చుని దర్శనమిచ్చారు.

- సార్ అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ మన వెన్నంటే ఉన్నారని, మన తప్పులు సరిదిద్దుతూ ఉంటారని తెలిపే ఈ మధ్యనే జరిగిన ఒక సంఘటన శ్రీ రామకృష్ణ

భట్టు ఇలా చెబుతున్నారు. 2018 ఫిబ్రవరిలో సార్ వ్రాసిన లెటర్స్ 3 పేజీలు నగేష్ నాకు ఇచ్చి టైపు చేసి పెట్టమన్నాడు. నేను ఒప్పుకుని చెప్పిన తేది తర్వాత కూడా ఆ పని పూర్తి చేయలేదు. ఆ రోజు రాత్రి కలలో నా సగం మీసం తీసేసినట్లున్న నా ముఖం అద్దంలో రెండు సార్లు చూపించారు. దాంతో సార్ చేసిన హెచ్చరిక అర్థమై, మరురోజు వెంటనే ఆ టైపింగ్ పని పూర్తి చేసి పంపించాను.

- దమ్మపేట వాస్తవ్యులు దారా నాగేశ్వరరావు గారు గొలగమూడిలో ఉన్న ప్రతిరోజు ఉదయం 4 గంటలకు స్వామి సమాధి మందిరం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఒక ఆదివారం ఉదయం నిద్ర లేచినా మందిరంలో ప్రదక్షిణలు చేయనీయకుండా గేట్లు వేసి ఉంటారని పడుకునే ఉన్నారు. ఆయనకు కలలో తిరుపతయ్య గారు కనపడి ఆయనతో టైం అయ్యింది. వెళ్లి ప్రదక్షిణలు చేయండి అని చెపుతున్నాడు. దానికి ప్రత్యుత్తరంగా నాగేశ్వరరావుగారు ఇవాళ ఆదివారం. గేట్లు వేసుంటాయి అని చెప్పారు. అంతలోనే సార్ శ్రీ సాయి మాస్టర్ నిలయం లోపల నుండి వస్తూ నాగేశ్వరరావుగారితో "ఏం అక్కడ చెయ్యలేకపోతే ఇక్కడ చేయొచ్చు కదా!" అని సార్ సమాధిని చూపెట్టారు. నాగేశ్వరరావుగారు వెంటనే లేచి సార్ సమాధికి ప్రదక్షిణలు చేసారు.
- శ్రీ శ్రీ శ్రీ దర్గాస్వామి భక్తుల లీలలు ప్రసాద్ సంకలనం చేసాడు. ముద్రించే ముందర శ్రీ దర్గాస్వామి ఆశీస్సులు కోసం పెడుతున్నానని వేణు గోపాల్ గారికి చెపితే ఆయన "ఒక కాపీ పుస్తక రూపంలో ప్రింట్ చేయించి స్వామి ఆశీస్సులు తీసుకో" మన్నారు. ఆ రోజు రాత్రి ప్రసాద్ కి కలలో సార్ వారింటి పెరట్లో ఉన్నారు. ప్రసాద్ ఏదో పని మీద ఇంటి ముందరకు వస్తూ "అరెరే సార్ కి ప్రూఫ్ రీడింగ్ చేయమని బుక్ ఇస్తే బాగుంటుందని, వెళ్లి బుక్ ఇచ్చాడు". తర్వాత రోజు ఉదయం నిద్ర లేచిన తర్వాత తెలిసింది ఏమిటయ్యా అంటే ప్రతిసారి సార్ అనుమతి, ఆశీస్సులకై ఒక కాపీ ప్రూఫ్ రీడింగ్ కు మొదట ఇవ్వటం అలవాటు. కానీ ప్రసాద్ సార్ సమాధి అయ్యారు అనుకుంటున్నాడు కానీ ఆయన నిత్యసత్యులనే విషయం మరచిపోయినా సార్ అనంత కరుణతో గుర్తు చేసారు. ప్రసాద్ అలానే ఒక కాపీ సార్ సమాధి దగ్గర పెట్టి విన్నవించాడు. సార్ దయ వలన దర్గాస్వామి ఆశీస్సులు కూడా లభించి ఆ గ్రంథం చక్కగా ముద్రితమైనది.

## సార్ లెటర్లు

శ్రీ సార్ తనను, స్వామిని ఆశ్రయించిన వారిని ఆదుకుని నడిపించే రీతులలో మరో ముఖ్యమైన పంథా లెటర్స్. లెటర్స్ ద్వారా సార్ ఎందరికో మార్గ దర్శక సూచనలు ఇవ్వటమే కాక వారి దివ్య శక్తితో మిళితమైన వారి లిఖిత వాక్యాలు సూటిగా చదివిన వారి హృదయాల లోనికి చొచ్చుకొనిపోయి అవసరమైన అద్భుత మార్పు తేవటం ఎందరికో అనుభవం. సార్ letter ల లో విద్యార్థులకు, గృహస్థులకు, సాధకులకు, ఉత్తమ ధర్మాచరణ కు, సాధన కు, శరణాగతి కి, సద్గురు సేవకు మొ|| అన్ని తరగతుల వారికీ, అన్ని వయస్సుల వారికీ తగ్గ సూచనలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. మచ్చుకు కొన్ని ఇచ్చుట పొందు పరచట మైనది.

### శ్రీ సాయినాధాయ నమః

17-12-1998 గొలగమూడి

శ్రీమతి భవాని గారికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా ఉండాలని ప్రార్థిస్తూ పె. సుబ్బరామయ్య వ్రాయటం.

మీ లెటర్ చేరినది. ముందు మనం కృషి చేయాలి. తర్వాత శ్రీ స్వామి వారి ఆశీస్సులు లభిస్తుంటాయి. వారెంతో కరుణా మయులు. మనం వారిని స్మరించని కాలంలో కూడా వారు మనతో ఉండి మనలను కనిపెడుతుంటారు. కానీ నిరంతరం మనతోనే ఉంటూ మనలను కష్టసుఖాలలో వెంట నుండే దైవాన్నివదిలి మనం అన్ని విధాలా బాగున్నప్పుడు వాళ్ళ స్వార్థానికి ఉపయోగ పడుతున్నప్పుడు మాత్రమే మనతో ఉండే స్నేహితులు, బంధువులను మాత్రమే చేరుతుంటాము. వారితో స్నేహం చేస్తుంటాము. ఆ మాత్రం దైవంతో స్నేహం చేయలేము. ఇదే మాయ.

మొదట మనం మనకొరకు బ్రతకటం నేర్చుకోవాలి. 100 కి 100 మంది ఇతరులు మనలను గూర్చి ఏ మనుకుంటున్నారో (అని ఆలోచిస్తూ), వారు మనలను గురించి మంచి మంచి అభిప్రాయం కల్గి ఉండేటట్లు జీవించ ప్రయత్నిస్తుంటారు. అది చాలా తప్పు. మనం ఇతరులను గూర్చి ఎంత విమర్శించినా, పరోక్షంగా దూషించి తప్పులు

వెతికి వారిని దూషించినా మన నోరు బుర్రలు చెడి పోవటం, మనం బాబా గారి ఆజ్ఞలు తప్పటం తప్ప ఆవ్యక్తులు ఏమైనా బాగు పడతారా? వాళ్ళు బాగు పడతారో చెడి పోతారో మనకు అక్కరలేదు. వాళ్ళను విమర్శించి పాపం మూట కట్టుకొంటున్నాము. మానవుడు ఈ దుర్గుణం ఉన్నంత వరకు అతని పాపం పెరుగుతూనే ఉంటుంది. దాని ప్రభావం వలన మానవులు తెలియకుండానే తన కష్టాలను తానే తెచ్చుకుంటాడు. నేను కూడా మా హెడ్ మాస్టర్ టీచర్స్ ను గూర్చి వారు లేని సమయాలలో విమర్శిస్తుండేది. ఇతరులను నిందిస్తుంటే ఆసక్తిగా వినేవాణ్ణి. నాకు ధ్యానం కుదరలేదని పూజ్యపాదులు ఆచార్య భరద్వాజ మాస్టార్ గారికి చెబితే వారు ఒక్కటే మాటన్నారు. “వాళ్ళు లేకుంటే నీవు బ్రతకలేవా ?” అని.

నిజంగా నేను బడిలో చెప్పినందుకు జీతమిస్తున్నారు. కానీ అందరిని గూర్చి విమర్శించి, విమర్శలు వినినందుకు కాదు కదా ? వీళ్ళ కోసం బాబా మాట అతిక్రమించి పంది మల భక్షణం చేయటం వంటి విమర్శలు మాని వేయ తల పెట్టాను. అంతే ఇక నా డ్యూటీ నిర్వహణలో నిమగ్నమై వారికి దూరంగా ఒంటరిగా చెట్ల క్రింద కూర్చొని బాబా తో స్నేహం చేయ సాగాను. వివరంగా వ్రాస్తే ఇంకా రెండు పేజీలు వ్రాయాల్సి వస్తుంది. అది మొదలు నా పాపం తగ్గనారంభించి బాబాకృప అనుభవం కాసాగింది.

నీవు కూడా నీకు తోడూ బాబా వుండాలంటే మొదట ఈ మానవుల స్నేహాలు, విమర్శలు, మాటలను మానేస్తే మనకు బాబాను గూర్చి చింతన చేయటం, పారాయణ చేయటం, పూజ చేయటం, వారి దివ్య లీలలు మననం చేయటం వంటి ఉపయోగకరమైన పనులు చేయటానికి వీలు కలుగుతుంది.

“వాళ్ళు మనం వినకుంటే కోపపడతారేమో“ అని సంశయం విడనాడందే, మనకు మంచి జరిగే ప్రసక్తే లేదు. కష్టాలలో మనలను ఆదుకునే స్నేహితులైతే మనం చేసే పని (ఇతరులను విమర్శించటం) తప్పు అని మంచి మాటలతో చెప్పి వదల కొట్టుకోవటం. కొందరితోనైతే అసలు స్నేహాలు మానటం. మనకు పిచ్చి పట్టిందని వాళ్ళు అనుకున్నా ఫరవాలేదు.

రెండవవది అన్నం తిని చదువుకోవటం కొందరికి వీలు కాదు. నేను, నా కుమార్తె అలాంటి వాళ్ళమే. అన్నం తింటే ఇక నిద్ర కనుక అన్నం తినటం అనేది చదువు అయ్యాక పడుకునే ముందు తినటమే. హాస్టలులో ఆ సమయంలో అన్నం పెట్టరనుకుంటే పూరీ బాక్స్ లో అన్నం పెట్టించుకుని చిన్న ప్లాస్టిక్ సీసాలో మజ్జిగ పోయించుకొని రూములో పెట్టుకుని 10½ గంటల ప్రాంతంలో తినేది. ఈ లోగా ఆకలి గదా అనుకుని భరించ లేకుంటే రెండు ముద్దలు తినేది. లేకుంటే అట్లాగే ఉంటే అలవాటు అవుతుంది. చదివింది గుర్తు ఉంటుంది. బాగా చదవగలుగుతాము.

ఉపనిషత్తులలో విద్యార్థి లక్షణాలు కొన్ని చెప్పారు. జీర్ణ వస్త్రం, మితాహారం, కాక దృష్టి, బక ధ్యానం అన్నారు.

**జీర్ణ వస్త్రం:** విద్య యందు తృష్ణ కలవాడు తాను ధరించే వస్త్రాలంకరణను గూర్చి పట్టించుకోడు. ఎప్పుడూ పాత గుడ్డలే ధరిస్తాడు. కానీ ప్రస్తుత కాలంలో నూటికి 90 మంది విద్యార్థులకు గుడ్డల పిచ్చే. నా తోటి ఒక స్నేహితుడు ఉండేవాడు, వాడొక రోజున వీపున చినిగి పోయిన చొక్కా వేసుకున్నాడు. స్నేహితులు చూచి విన్నీసు చేసారు. అతనికి తన డ్రస్ విషయమే పట్టదు. ఎప్పుడూ చదువులో మునిగిపోయి ఉంటాడు. అతనిప్పుడు అమెరికాలో గొప్ప రీసెర్చ్ ప్రొఫెసర్ గా ఉన్నాడు. అతని వలె చదివేవారెవరు ? అందరికి డ్రస్ పిచ్చి, తిండి పిచ్చి.

**మితాహారం:** రుచిగా ఉన్నదని కాకుండా చదువు పూర్తయిన దాకా నన్నా శరీరం నిలిచేందుకే ఆహారం తినాలి. బాగా తింటే బలమొస్తుందని తినకూడదు. బలం వస్తే మనమేమన్నా కుస్తీ పట్టే వస్తాదులము అవ్వాలా ఏమిటి?

**కాక దృష్టి:** కాకికి రెండు కండ్లున్నట్లు మనకు కనపడినా నిజానికి దానికి ఒక కన్ను కనబడదు. ఒకే కంటితో ఎంతో జాగ్రత్తగా చూస్తుంది. అలాగే మన దృష్టి కూడా ఒక చదువు పైననే ఉండాలి. ఇక కుటుంబ విషయాలు, స్నేహితుల విషయాలు, ప్రపంచ విషయాలు దగ్గరకు రాకూడదు. అప్పుడే సరస్వతి మాత మనలను వరిస్తుంది.

**బకధ్యానం:**బకము అంటే కొంగ. నీటిలో ఒంటి కాలి పైననే నిలబడి ఉండి తన కాలు దగ్గరకు వచ్చిన చేపను టప్పీక్కుమని పట్టుకుంటుంది. మనం కూడా మన ధ్యాసంతా చదువుకోవటం పైనే ఉంచితే వద్దన్నా చదువు వస్తుంది.

నా కుమార్తె 10 వ తరగతి చదివాక చదువు వద్దంటే వద్దన్నాను. ఆమెకు చదువు పిచ్చి. బాగా చదివిస్తే అంతకంటే ఎక్కువ చదివిన అల్లుడిని వెతకాలని ఎక్కువ కట్నం ఇవ్వలేం గనుక పెద్ద చదువులు చదివిన వాళ్ళను తేలేమని నిర్మొహమాటంగా చెప్పేశాను. ఆమె ప్రైవేటుగా open యూనివర్సిటీ కి కట్టి B.Com. C.A.HIB పాస్ అయ్యింది. బ్యాంకు ఎంట్రన్సు టెస్ట్ పాస్ అయింది. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయి ఇప్పుడు బ్యాంకు లో, స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా లో పని చేస్తోంది. ఆమెకు గుడ్డలు తిండి అక్కరలేదు. స్నేహితులు అక్కర లేదు. తనను కదిలించ కుండా చదువుకోనిస్తే చాలు. కొన్ని విషయాలలో ఆమెను నేను గురువుగా స్వీకరిస్తాను.

కవర్ లో పెన్ పంపటం వీలు కాదు. Refil పంపుతున్నాను. అక్కడికి చేరే సరికి పని చేస్తుందో లేదో. సరిగ్గా వ్రాయకుంటే అది అశుభమని తలచ వద్దు. శ్రీ స్వామి వారి సమాధికి తాకించే పంపుతున్నాను.

ప్రస్తుతం పారాయణలు అవసరం లేదు. నిత్యం పది నిమిషాలు గాని, పదిహేను నిమిషాలు గాని పూజ చేసుకోమను చాలు. బాబా చెప్పిన పని చేయకుండా మనకిష్టమొచ్చిన పని చేయకూడదు. బాబా మనకు చదివే పని అప్పగించారు. ఆ పని సక్రమంగా నెరవేర్చుకోవాలి గదా ! దోవన నడుస్తున్నప్పుడు, ఎప్పుడు తీరికగా వున్నా వారి నామం చేసుకుంటే చాలు. ఓర్పు, సహనం ఇతరులకు మంచి చేయటం అన్నీ నిదానంగా అవే వస్తాయి.

ముందు మనం చదువులో మునిగి పోవాలి. అందుకు ఆహార నియమం పట్టుదల అవసరం. మనం చేయ వలసిన కృషి చేస్తే బాబా కృప తప్పక కలుగుతుంది. కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు. కృషి చేసిన వారికి కరువే ఉండదని భావం.

మానవుని ప్రధమ శత్రువు సోమరితనం. దాన్ని తరిమేందుకు తీవ్రమైన పట్టుదల శ్రద్ధ ఉండాలి. తీవ్రమైన అని మహర్షులు ప్రయోగించారు. దాన్ని సాధించిన వారికి తిరుగులేదు.

స్వామి వారి ఆశీస్సులతో పె. సు.

ఓం

గొలగమూడి, 27-12-2002

Dear Siva,

నీ లెటర్ అందినది. నిష్కామ కర్మకు ఒక లిస్టు పనులంటూ లేవు. మన పర్సనల్ గా ఉపయోగపడే పనులు కాక ఇతర పనులని అర్ధం. ఉద్యోగం చేస్తున్నాము. జీతం తీసుకుని పొట్టకు సంపాదించుకొంటున్నాము. కుటుంబ పోషణ మన బాధ్యత కనుక దానికి ఖర్చు పెడుతున్నాము. ఆ ఉద్యోగం నిష్కామ కర్మ కాదు. తనకు వచ్చిన ధనంలో కొంత ధర్మ కార్యాలకు ఖర్చు చేశాడు. అది నిష్కామ ఖర్మ అవుతుంది. ఇందులో మాష్టారు చెప్పేది బాగా అర్ధం చేసుకోవాలి. పని ఏమైనా మనసు చలించరాదు. సఫలమైనప్పుడు సంతోషము, విఫలమైతే దుఃఖము, బాధ వగైరా ఉండరాదు. భగవంతుడు అలా చేస్తే మనమేం చేస్తాము. అలా మనసు చలించకుండా ఉండటమే నిష్కామకర్మ ధ్యేయం. అందుకే మనలోని మలదోషం పోవటానికి నిష్కామకర్మ చెప్పారు. మల దోషమంటే రాగ, ద్వేష, అసూయాదులు.

పె. సుబ్బరామయ్య

---

ఓం

గొలగమూడి, 13-11-2002

Dear Siva,

నీ లెటర్ చేరింది. శ్రీ నాంపల్లి బాబా గారు స్వప్న దర్శనమిచ్చి మాట్లాడారంటే భౌతిక దర్శనంతో సమానమే. తొణుకు బెణుకు లేకుండా భగవంతుడు నీ కిచ్చిన పని చక్కగా చేస్తూ పోవటమే మార్గము. తొందరపడి భగవంతుడు మనకిచ్చిన పని చేయటంలో అశ్రద్ధ చూపకూడదు. ఇంత గొప్ప సృష్టిలో మన పాత్ర మనం చక్కగా నిర్వహించేటట్లు మొదట చూచుకోవాలి. ఆధ్యాత్మికత పేరుతో నేడు జరిగే విశ్రుంఖలత

గుర్తుంచుకో. శ్రీ స్వామి వారు నిన్ను సర్వదా కాపాడాలి ప్రార్థిస్తూ.

మీ పె. సుబ్బరామయ్య

---

ఓం

గొలగమూడి,24-11-03

Dear Sai,

Mental గా enlightenment – శరణాగతి తర్వాత దిగజారి అసక్తులవటం : శరణాగతి అనేది ఒక రోజు చేసి తరువాత free గా ఉండటం కాదు. జీవితాంతం శరణాగతిలోనే ఉండాలి. ఈ నాటి mental enlightenment అది ఈ జన్మలో సాధించినది కాదు. అది పూర్వ జన్మ సాధనా ఫలితం. ఈ జన్మలో శరణాగతి పోగొట్టుకుని మానసికమైన చంచలత్వం వస్తుంది. దాంతో సత్, అసత్ గుర్తించే శక్తి పోయి, సద్గురువును వదిలి, (పైగా) తానే సద్గురువును అడ్డం పెట్టుకుని తానే ప్రజల భాధలు తీరుస్తున్నట్లు నటిస్తుంటారు. దాంతో మరల జిడ్డు అంటుకోసాగుతుంది. దిగజారి పోతాడు. తన డౌన్ ఫాల్ తను గుర్తించ లేడు ఎందుకని? తనను ఆశ్రయించిన వారి పొగడ్తలతో కళ్ళు మూసుకుపోతాయి. చివరకు చిప్ప చేతికి వస్తుంది. ఎంత enlightmentment వచ్చినా తన గురువును వదలటం లోనే తన డౌన్ ఫాల్ మొదలైందని గుర్తించలేడు.

1) ఇంద్రియచాపల్యాలకులొంగక ఆచరించేదేలా? లొంగితే ఏమి? భగవత్ గీతలో చెబుతాడు –
   ఇంద్రియలోలత్వం ద్వారా మానవుని ప్రజ్ఞ హరించిపోతుంది – గాలి వలన పడవ వేగం నశించినట్లు అంటారు. (ప్రజ్ఞ అంటే మానసిక, శారీరిక సామర్థ్యాలు అని అర్థం) అవి పోయాక ఇక మనం ఎందుకు పనికి రాము. మనలో భల్లూకపు పట్టుదల వుండాలి. **ఈ పట్టుదల సడలకుండా వుండాలంటే నిత్యం సద్గురువు మనకు చేసిన సహాయాలు, ఇచ్చిన అనుభవాలు తలచుకుని పులకించి పోవాలి. పూజలో గగుర్పాటు రావాలి. నిత్యం గగుర్పాటు వచ్చేవిధంగా మన అనుభవాలు మననం చేస్తుండటమే గొప్ప పూజ. ఆ కాలమే సద్గురువుకు అర్పించిన ఉత్తమోత్తమ పుష్పం.** అప్పుడు ఇంద్రియ చాపల్యాలకు ఎందుకు లొంగకూడదో,

భల్లూకపు పట్టుదల ఎందుకు అవసరమో తెలిసి వచ్చి ముందుకే వెళతాం కానీ వెనుకంజ ఉండదు. మనకిచ్చిన ఒక్క అనుభవాన్ని కూడా స్మరించని పూజ పూజే కాదు. అది యాంత్రికము లాంఛన ప్రాయమైనది. అనుభవాలు రాని వాళ్ళ సంగతి అలా ఉంచాలి. వాళ్ళు ఇతరులకిచ్చిన అనుభవాలు స్మరిస్తారు. స్మరించాలి. లేకుంటే అంతా wasteful thing!

2) మొదట రావలిసిన పరిణితి విశ్వాసమే : దానికి మార్గమేది ? i) పుణ్యంii) నియమ పాలన. విశ్వాసం కలిగాక అది బాగా పెరిగి మహా వృక్షమవ్వాలంటే – మనకు సద్గురువు చేసిన మహోపకారాలను లోతుగా మననం చేస్తూ గగుర్పాటు చెందుతుండటమే. అలా చేస్తే మన విశ్వాసం సడలదు. అంతే కాక చక్కగా పెరుగుతుంది.

3) ఆహారనియమం ఎప్పుడూ అవసరమే. కారుకు పెట్రోలు బదులు క్రూడాయిలు, కిరోసిన్ పోసి నడిపితే ఏమౌతుంది? కారు నడుస్తుంది. కానీ ఇంజన్ చాలా త్వరగా చెడి పోతుంది. Irreparable అవుతుంది. దైవం వచ్చి ఆహార నియమం చెప్పనక్కరలేదు. మన శరీరం ఏది తింటే సరిగా పని చేస్తుందో మనమే తెలుసుకోగలం. ఇంద్రియ చాపల్యాలకు లొంగకుండా భల్లూకపు పట్టుదలతో సాగటమే. బోంబే రైల్వే స్టేషన్ లో కిరోసిన్ స్టవ్ పెట్టి 2 kg బియ్యం అన్నం వండాను. అంతా సద్గురువుచే చేయబడింది.

**మొదట మనలో పట్టుదల ఉండాలి. భల్లూకపు పట్టుదల** - ఆశీస్సులతో పె. సు.

om

గొలగమూడి,

22 – 5 – 05

Dear Sai !

సద్గురువు లభించగానే అంతా అయిపోయినట్లు కాదు. వారు చెప్పింది చేయాలి. అలా చేసేందుకు మాయ పొంచి ఉండి ఎప్పుడూ మనలను చేయనీయకుండా అడ్డు పడుతుంది. మాయకు లోబడినవాడు మానవుడే కాదురా అన్నారు. అంటే మానవుడి కంటే హీనుడని అర్ధం .

శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ చెప్పిన మాటలు గుర్తుంచుకో.

***దైవీ హ్యేషా గుణమయీ మమమాయా దురత్యయా***
***మామేవయే ప్రపద్యన్తే మయా మేతం తరంతితే.***

**<u>సద్గురువనెడి మంచి నౌక లభించినవారు :</u>**

**1. అనుభవమనెడి కౌపీనము ను బిగించి**
**2. అహంకారమను మిక్కుటమగు బరువును పారవైచి**
**3. సంకల్పములు,వికల్పములనెడి అలల నుండి తప్పించుకుని**
**4. విషయాసక్తి అనెడు తీవ్రమైన వానదెబ్బ నుండి కాపాడుకుని**
**5. ఆత్మబోధ యనెడు బల్లకట్టు నందుకుని**
**6. వైరాగ్యమనెడు చేతులతో నెట్టుకొనుచు**
7. **శ్రద్ధా,సామర్ధ్యము ల పై తేలుచూ**

*నన్ను పొందగలరు.*

పై ఏడు అంశముల ద్వారా మనము శ్రద్ధతో కృషి చేస్తూ ఉంటే తప్ప వారి కృప మనకు కల్గదు. **పిచ్చి ప్రార్ధనలు లక్ష చేసినా అవి గాలికి పోతాయి. మనం శ్రద్ధతో చేసిన కృషే లెక్కలోనికి వస్తుంది.**

మొట్టమొదటనే నీ అనుభవాన్ని చూచుకుని ప్రవర్తించమంటారు. ఏది తింటే ఏమైంది, ఎంత తింటే ఏమైంది, ఏది తిన్నప్పుడు చదువు బాగా సాగింది ఎంత తింటే మనం హుషారుగా ఉండగలిగాము అనేవన్నీ అనుభవం ద్వారా తెలుసుకుని ఆచరించు. కఠోర నియమ పాలన చేయమంటారు. చాపల్యంబులు నసించనిదే వెయ్యి జన్మలైనా మనం అక్కడనే ఉంటామో ఇంకా దిగజారుతుంటామో తెలియదు. మిగతా విషయాలన్నీ వదిలేసి మనకు శ్రీ స్వామి వారిచ్చిన పనిమీద మనదృష్టంతా పెట్టాలి

శ్రీ స్వామివారి ఆశీస్సులతో, పె.సు.

---

గొలగమూడి, 27-06-05.

Dear Sai,

ప్రతి మానవుడు సుఖశాంతులతో తృప్తిగా జీవించాలని తలుస్తాడు. కాని అట్టి సుఖము, శాంతి, తృప్తి అనునవి మనం ఆచరించే ధర్మము వలన మాత్రమే లభిస్తాయని ఎన్ని శాస్త్రాలు ఘోషించినా, మహాత్ములు అందరూ ఎలిగెత్తి చాటినా

ఆశాబద్ధుడైన మానవునకు అట్టి ఆచరణ దుస్సాధ్యం అయ్యింది. అట్టి ధర్మాచరణ మన నిత్య జీవితంలో సహజ సిద్ధమయ్యేందుకు మహనీయుల సాంగత్యం ఒక్కటే శరణ్యమని భగవద్గీతాది గ్రంధాలన్నీ చెబుతున్నాయి. వారి ప్రత్యక్ష సానిధ్యము లభించనప్పుడు మహాత్ముల చరిత్ర పారాయణ కూడా మహాత్ముల ప్రత్యక్ష సానిధ్యంతో సమానమని ఎందరో భక్తుల అనుభవాలు ఋజువు చేస్తున్నాయి. మహనీయుల చరిత్ర పారాయణ ద్వారా అనేక మంది భక్తులలో కలిగిన హృదయ పరివర్తనే ఇందుకు నిదర్శనము. అట్టి ధర్మాచారణను గూర్చి శ్రీ స్వామివారు ఏనాడు పెద్దగా ఉపన్యసించకున్ననూ శ్రీ స్వామి వారి నిత్య జీవిత సంఘటనల నుండి ఇట్టి ధర్మభోధ వినగలిగిన వారికి అనుక్షణమూ వినిపిస్తూనే ఉంటుంది.

శ్రీ స్వామివారి గురువు వారికి ఒక పని ఒప్పగించి చేయమన్నారు. అదే ఇతరుల బాధలను తన తపోశక్తితో క్షాళన చేయడం. ఇతరులు అంటే మానవులే కాదు సర్వ జీవుల యొక్క బాధలు తీర్చడం. ఆ కృషిలో నిమగ్నమై తన శరీరాన్ని మరచిపోయి పని చేసారు. మన గురువు మనకొక చిన్న పని పెట్టారు. ఆ పనిలో నిమగ్నమై మనం ప్రపంచాన్నే మరచిపోవాలి. ఆ పని తప్ప ఇతర యోచనలే ఉండకూడదు. ఒక రోజు నాకు మందిరం కట్టగా మిగిలిపోయిన రాతి ముక్కలను కంకర కొట్టించమన్నారు. ఆ విషయం రేపటి లెటర్ లో వ్రాస్తాను.

స్వామి వారి ఆశీస్సులతో పె. సు.

## సార్ సూక్తులు (Excerpts from Sir Letters)

- నీ ఆలోచనలన్నీ అహంకారమే !
- ఆధ్యాత్మికతలో మొట్టమొదటి లక్షణం మనం అలవాటు చేసుకోవలసినది: అభయం
- మొదట రావలసిన పరిణితి విశ్వాసమే ! దానికి మార్గమేది ? (1) పుణ్యం, (2) నియమపాలన

- మొదట మనలో పట్టుదల ఉండాలి. భల్లూకపు పట్టుదల !
- వాళ్ళుండే దాన్ని బట్టి కదయ్యా మనం ఉండేది అక్షరాలా పరమ సత్యం- ప్రతి ఒక్కరికి అన్ని కాలాలయందు వర్తిస్తుంది.
- నీ ప్రయత్నమంతా మనసు భగవంతునిపై నిలిపేందుకే చేయాలి.
- ఎప్పుడంటే అప్పుడు, ఎవరు పెడితే వారి దగ్గర (ఎంత పడితే అంత) తినటం మానాలి.
- నాలికను వదిలామంటే బురద గుంటలోకి తోస్తుంది. నాలికను దాటితే ఏమి లేదు.
- అసలు లోకం ఎటు పోతే మనకేమి ? మనం లోకాన్ని ఉద్దరించ గలమా ? మన కర్తవ్యం మనం చేసుకుంటూ పోవాలి.
- ఇంద్రియ చాపల్యాల విషయంలో నీవు చాలా జాగ్రత్తగా ఉండు.  ధర్మం, ధర్మం, ధర్మం ఇది మాత్రమే సద్గురుని మెప్పిస్తుంది. ధర్మం తప్పాక main line తో ఎలక్ట్రికల్ కాంటాక్ట్ పోయిందన్న మాట. అది పోతే మనమెందుకు పనికిరాము.
- ప్రతీ దానికి హృదయ పూర్వకమైన ప్రార్దనే సాఫల్యమివ్వగలదు.
- పిచ్చి ప్రార్ధనలు లక్ష చేసినా అవి గాలికి పోతాయి. మనం శ్రద్ధ తొ చేసిన కృషి లెక్కలోకి వస్తుంది.
- మన పారాయణ ఒక dead spiritual practice కాకుండా చూసుకోవాలి.
- భగవంతుడు మనలను ఏ ఆశ్రమంలో ఉంచితే ఆ ఆశ్రమ ధర్మాలను పాటించాలి.
- భగవంతుడు నిర్దేశించిన పనిని ఆయనకు తృప్తి కరంగా నిర్వహించాలి. “తమరు ఆజ్ఞాపించిన పనిని మీకు ప్రీతి పూర్వకంగా చేయవే ప్రభూ” అనేదే మనం చేయవలసిన ప్రార్ధన.
- ఇష్టాయిష్టాలు పోవటం అంటే భగవంతుడు మనకు ఇచ్చిన పనిని నూటికి నూరు పాళ్ళు తృప్తితో ఆచరించడమే మార్గం.
- ఇష్టా ఇష్టాలు లేకుండా జీవించడం అనే జీవిత కళ అభ్యసిస్తే ధ్యానం చాలా సులభంగా కుదురుతుంది.
- మనకు జరిగే సన్నివేశాలన్నీ మన మంచికే. ఆ సద్గురు మూర్తి జరిపిస్తున్నారు అన్న ఎరుక ఏమారకుండా ఉండాలి.
- అందరి కంటే  గొప్పగా వారి కృప పొందాలన్న ఒక్క ధ్యేయం ఉంటే వ్యామోహాలు, జిహ్వాచాపల్యాలు అన్నీ పోతాయి.

- ఎవరి ధర్మాన్ని వారు త్రికరణశుద్ధి గా ఆచరిస్తే వారికి కలిగేదంతా ఆనందమే.

## సాయికృప పొందాలంటే

- మన అలవాట్లన్నీ క్రమబద్ధం చేసుకోవాలి. మార్చుకోవాలి.
- నిత్యం పూజ, పారాయణ రోజు ఒకే సమయంలో చేయాలి, వీలున్నప్పుడు చేస్తానంటే సాయి కూడా వీలున్నప్పుడు మనవైపు చూస్తారు.
- రోజుకు 24 గంటలు. అందులో ఒక అరగంట సాయికి సమర్పించకుండా ఆయనను ఇది చెయ్యి, అది చెయ్యి అని అడగడం ఎలా వీలౌతుంది. మనం ఏమారిన క్షణంలో కూడా ఆయన మనలను రక్షించాలి. మనం మాత్రం వీలున్నప్పుడు ఆయన వైపు చూడాలి. ఇది మంచిది కాదు.
- మాట్లడితే సాయిని గురించి, మహనీయుల గురించి మాట్లాడాలి.
- పారాయణ, మననం చాలా ముఖ్యం. ఈ మననం ద్వారా మనలోని రాగ,ద్వేషాలు పలుచబడతాయి. ఇలా ఏదో ఒకటి చేస్తుంటే కొంత కొంత అభివృద్ధి ఉంటుంది.

## విద్యార్థి దశలో

- నీవు చేయవలసిన పూజ, ద్యానం అంతా చదువే. నీవు ధరించబోయే impliment పరికరాన్ని బాగా పదును పెట్టుకుని impliment తయారు చేసుకోవాలి. అది భగవంతుడు మనకు నిర్దేశించిన పని. ఆ పని అత్యంత గొప్పగా నెరవేర్చేటట్టు చేయమని బాబా గారిని ప్రార్థించు.
- మితాహారం, జీర్ణ వస్త్రం, కాక దృష్టి, బకధ్యానం – విద్యార్థి లక్షణాలు.
- నీవు చక్కగా చదవటం సాయికి చేసే పూజ అవుతుంది. ఆయనను మెప్పించేందుకే చదువుతున్నాను అనే ఒక్క భావం ఎప్పుడు మరచి పోకుండా ఉండు. విద్యార్థి లక్షణాలు నిత్యం మననం చేస్తుండు.
- నీకు ఏ మాత్రం తీరిక ఉన్నా నాకు తెలిసిన మాష్టారు అనే పుస్తకం మరలా మరలా చదివి శత్రుమిత్రుల ఎడల సమభావం, మానావమానాలలో సమతుల్యంగా ఎలా ఉండాలో బాగా ఆలోచించి మాష్టారి ఆచరణ ఎలా ఉండేదో చూచి నేర్చుకో చేతికి వచ్చిన ప్రతిపైసాను దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చెయ్యి .

## ఆహారం - జిహ్వ

- రుచులు పాకాలుగా తినడం తగదు. శరీరానికి శక్తే గాని, రుచికి తినరాదు. Food విషయం జాగ్రత్త. అప్పుడు మన సాధన ఉదృతమౌతుంది. Practical గా చేసి చూడు.
- ఆకలికి ముందుగా భగవంతుడు ఇచ్చింది ఆయన ప్రసాదంగా తినాలి. మితాహారం అన్నారు గాని నిరాహారం అనలేదని గుర్తించు.
- అందరికంటే గొప్పగా వారి కృప పొందాలన్న ఒక్క ధ్యేయం ఉంటే వ్యామోహాలు, జిహ్వాచాపల్యాలు అన్నీ పోతాయి.
- ఆహార నియమం ఎప్పుడూ అవసరమే. కారుకు పెట్రోలు బదులు క్రూడాయిలు, కిరోసిన్ పోసి నడిపితే ఏమౌతుంది? కారు నడుస్తుంది. కాని ఇంజను చాలా త్వరగా చెడిపోతుంది irrepairable అవుతుంది. దైవం వచ్చి ఆహారనియమం చెప్పనక్కరలేదు.
- మన శరీరం ఏది తింటే సరిగా పనిచేస్తుందో మనమే గుర్తించాలి. భగవంతుడు నిర్దేశించిన పని ఆయనకు తృప్తికరంగా నిర్వహించాలి. పారాయణ, పూజలు చేస్తే మనం ముందుకు పోతామని కఠినంగా శరీరాన్ని కష్ట పెట్టరాదు.

## జీవిత లక్ష్యం - మార్గం

- ఆయన సర్వసమర్థుడు – సర్వప్రేరణాధికారి;
- మనం ఒక్క అడుగు వేయడంలోనే మన ధర్మం ఉంది. ఆ తరువాత వారు మనలను నడిపిస్తారు. ఆ ఒక్క అడుగు బాబా కోరినట్లు వేస్తామా లేక majority of mass వేసినట్లే వేస్తామా అనేది count అవుతుంది.
- పట్టుదల, విశ్వాసము, ఓర్పు ఒకేసారి రావు. నిత్యం నిద్రకుపక్రమించే ముందు విధిగా ఆనాడు మనం చేసిన కార్యక్రమమందలి తప్పు, ఒప్పులను సమీక్షించుకోవాలి. ఒక 5 నిమిషాలు మనసులో విధిగా గుర్తుతెచ్చుకొని మనం తప్పు చేసిన చోట హృదయపూర్వకంగా తీవ్రంగా సాయినాధునికి క్షమాపణ

చెప్పుకుంటూ తిరిగి అలాంటి పొరపాటు జరగకుండా జాగ్రత్తపడే ప్రయత్నం చేస్తూ ఉంటే క్రమంగా అలవడుతుంది. ఎన్నో జన్మలుగా వచ్చిన సంస్కారాలు గదా!

- మనలో భల్లూకపు పట్టుదల ఉండాలి. ఈ పట్టుదల సడలకుండా ఉండాలంటే నిత్యం సద్గురువు మనకు చేసిన సహాయాలు, ఇచ్చిన అనుభవాలు తలచుకొని పులకించి పోవాలి. పూజలో గగుర్పాటు రావాలి. నిత్యం గగుర్పాటు వచ్చే విధంగా మన అనుభవాలు మననం చేస్తుండడమే గొప్ప పూజ. ఆ కాలమే సద్గురువుకర్పించిన ఉత్తమోత్తమ పుష్పం.
- అప్పుడు ఇంద్రియచాపల్యానికి ఎందుకు లొంగకూడదో, భల్లూకపు పట్టుదల ఎందుకు అవసరమో తెలిసి వచ్చి ముందుకే వెళతాం గానీ వెనుకంజ ఉండదు. మనకిచ్చిన ఒక్క అనుభవాన్ని కూడా స్మరించిన పూజ పూజే కాదు. అదే యాంత్రికము లాంఛన ప్రాయమైనది. అనుభవాలు రాని వాళ్ళ సంగతి ఇలా ఉంచాలి. వాళ్ళు ఇతరులకిచ్చిన అనుభవాలు స్మరించాలి లేకుంటే అంతే wasteful things !
- సత్ పౌరుడుగా నాకిచ్చిన కార్యాన్ని దేవునకు ఎంతో తృప్తికలిగేటట్లు నెరవేర్చేటట్లు ఆశీర్వదించమని అడుగు. అడగడమే గాక సాధ్యమైనంత వరకు నీవైపు నుండి హృదయపూర్వకమైన కృషి చెయ్యి.
- బిడ్డలను సత్ పౌరులుగా తీర్చిదిద్దే కృషి మనం చేయాలి. మనకృషితోనే వారు వివేకానందులంతటి వారౌతారని కాదు.మనకు భగవంతుడు ఇచ్చిన పని సక్రమంగా నిర్వర్తించిన వారమయ్యేందుకే.

**మరుపే మరణం !**



శ్రీ సద్గురు సుబ్బరామయ్య సార్ సమాధి